

# ప్రైవేట్ బస్సుల నిర్వాహకుల నిలువదోపిడీ



**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** సంక్రాంతి సొంతూర్లకు వెళ్లే ప్రయాణికులను ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు నిలువదోపిడి గురి చేస్తున్నారు. సాధారణ బస్సు ఛార్జీలకంటే రెట్టింపు వసూళ్ళకు పాల్పడుతుండడంతో ప్రయాణీకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతికి సొంత ఊర్లకు ప్రయాణాలు ప్రారంభమైన నాటి నుంచి ఈ దోపిడీ ప్రారంభమైంది. పిల్లల కు సెలవులు ప్రకటించడంతో నగరవాసులు తమ సొంత ప్రాంతాలకు వెళ్ళేందుకు పయనమవుతున్నారు. ఇదే మంచి అవకాశంగా భావిస్తున్న ప్రైవేట్ బస్సు నిర్వాహకులు ఇష్టంవచ్చిన రీతిలో వసూళ్ళకు పాల్పడుతున్నారు. కాగా ఇప్పటికే అన్ని రెగ్యులర్ రైళ్ళు, ప్రత్యే రైళ్ళు ఈనెల చివరి వర కు పూర్తిగా బుక్ అవడంతో ఆర్టీసి, ప్రైవేట్ వస్సులను ప్రయాణీకులంతా ఆశ్రయిస్తున్నారు. దీంతో పండుగ రద్దీకంటే ముందు ప్రైవేట్ బస్సుల దారిదోపిడి తీవ్రమైంది. హైదరాబాద్ నగరం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ఆర్టీసి రెగ్యులర్ సర్వీసుల్లో ఇప్పటికే ముందస్తు రిజర్వేషన్‌లు పూర్తి అయ్యాయి. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణీకులు రిజర్వేషన్‌లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో నగరం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రైవేట్ బస్సులకు సైతం విపరీతంగా డిమాండ్ పెరిగింది. ప్రయాణీకుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ బస్సులు ఇపనపటికే సాధారణ ఛార్జీలకంటే రెట్టింపు వసూళ్ళకు పాల్పడుతున్నా యి. కాంట్రాక్ట్ క్యారేజీలుగా నమోదైన వందలాది బస్సులు స్టేజీ క్యారేజీలుగా రోడెక్కి ప్రయాణీకుల జేబులను కొల్లగొట్టే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. బుకింగ్‌లు లేవంటూనే అధికంగా ఛార్జీలు వసూలు చేయడం, ప్రైవేట్ బస్సుల అక్రమ రవాణాపై ఆర్టీఏ అధికారుల నిఘాలోపం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు ఆర్టీసి నుంచి 4484 సంక్రాంతి ప్రత్యేక బస్సు లను నడుపుతోంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణ రోజుల్లో రూ.450వరకు ఛార్జీ ఉంటే ప్రస్తుతం రూ.600 నుంచి రూ.700కు పెంచారు. అలాగే హైదరాబాద్ నుంచి వైజాగ్‌కు రూ.1800 వరకు వసూలు చేస్తున్నట్లు ప్రయాణీకులు చెబుతున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, వైజాగ్, కాకినాడ, అమలాపురం, ఏలూరు తదితర ప్రాంతాలకు ప్రయాణీకుల డిమాండ్ భారీగా ఉంది. హైదరాబాద్ నుంచి ఏపీ నుంచి వెళేనవళ అన్ని రైళ్ళు భర్తీ అయ్యాయి. ఇటీవల ప్రకటించిన ప్రత్యేక రైళ్లలోనూ వెయి టింగ్ జాబితా 250 నుంచి 350 వరకు నమో దైంది. దీంతో గత్యంతరం లేక ప్రైవేట్ బస్సుల ను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు ఆర్టీసి సంక్రాంతి సందర్భంగా 4484 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఆర్టీసి నడిపే ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బ స్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయాన్ని కల్పి స్తున్నారు. అలాగే సంక్రాంతి ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు ఉండవని, సాధారణ ఛార్జీలతోనే ప్రయాణీకులు రాకపోకలు సాగించ వచ్చని చెబుతున్నారు. ప్రయాణీకులపై ప్రైవేట్ బస్సుల నిర్వాహకులు అడ్డగోలుగా ఛార్జీలు వసూలు చేస్తున్న అంశంపై ఆర్టీఏ అధికారులు దాడులు ముమ్మరం చేశారు.

హైదరాబాద్ వార్త



# ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక చర్యలు

## -నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ జనవరి 11, ప్రభాతవార్త**

రహదారి ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ రద్దీ నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు హైదరాబాద్ నగర పోలీసు కమీషనర్ కొత్త కోట శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్ హరిహరా కళాభవన్‌లో రహదారి భద్రత అవగాహన గోడపత్రిక, కరపత్రాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నార్త్ డిస్ట్రిక్ట్ పరిధిలోని పలు పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నగర పోలీస కమీషనర్ శ్రీనివాసరెడ్డి ట్రాఫిక్ నియమాలపై పాటించాల్సిన అంశంపై విద్యార్థులకు విలువైన సూచనలు చేసారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణతో పాటు రహదారులపై ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేసారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. ట్రాఫిక్ లో కొత్త విధానాలను అమల్లోకి తెచ్చి ప్రజలకు వీలైనంత మేర ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తెలంగాణా ప్రభుత్వం వాహనాలపై విధించిన ఛలాన్ల బకాయిలకు సంబంధించి జనవరి 31వ తేదీ వరకు గడువును పొడిగించారని, ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసారు. ఈ సందర్భంగా రహదారి భద్రత అవగాహన గోడపత్రిక కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నగర ట్రాఫిక్ జాయింట్ కమీషనర్ విశ్వప్రసాద్, బేగంపేట ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ సాలె రంగారావు, ఏసీపీలు శంకరరాజు, మధుసూధన్‌రెడ్డి, ఇన్స్‌పెక్టర్ రాంచం దర్‌నాయక్ , వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



రహదారి బద్రత గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న హైదరాబాద్ సీపీ శ్రీనివాసరెడ్డి అధికారులు.

# ఏడాదిన్నరలో 20 ఇంటి దొంగతనాలు...

## -నిందితుడి అరెస్టు - రూ.16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్

**గచ్చిబౌలి, జనవరి 11 ప్రభాతవార్త**

బిటెక్ చదివిన వ్యక్తి జల్సాల కోసం దొంగతనాల బాటపట్టాడు. తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా ఏడాదిన్నర వ్యవధిలో మొత్తం 20 చోరీలకు పాల్పడ్డాడు. పగటిపూట డెలివరీ బాయ్‌నంటూ రెక్కీ నిర్వహించడం... తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రిపూట చోరీ చేయడం ఇతని పని. ఎప్పటికప్పుడు తన నివాసాన్ని మారుస్తూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న నిందితుడిని మియాపూర్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేసి అతని వద్ద నుంచి 16 లక్షల రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు గురువారం మాదాపూర్ డిసిపి కార్యాలయంలో డిసిపి జి.వినీత్ వెల్లడించారు...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకులం జిల్లా కడకేల మండలం విక్రంపురం గ్రామానికి చెందిన బబ్బాడి అభిలాష్(20) బిటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ చదువుతూ మధ్యలోనే చదువును వదిలేశాడు. అనంతరం నగరానికి వచ్చి కెపిహెచ్‌బి హెచ్‌ఎంటి హిల్స్‌లో స్నేహితులతో కలిసి గది అద్దెకు తీసుకొని నివాసం ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడిన అభిలాష్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. దొంగతనాల కోసం బాలానగర్ పారిశ్రామికవాడ నుంచి భారీ కట్టర్‌ను కొనుగోలు చేశాడు. రోజంతా పలు కాలనీలలో సంచరిస్తూ సెక్యూరిటీ తక్కువగా ఉన్న అపార్టుమెంట్లను గుర్తిస్తాడు. డెలివరీ బాయ్‌నంటూ అపార్టుమెంటు లోపలికి ప్రవేశించి తాళం వేసి ఉన్న ఇళ్ల కోసం రెక్కీ నిర్వహిస్తాడు. అనంతరం రాత్రి పూట అపార్ట్‌మెంటు లోపలికి చొరబడి కట్టర్‌తో ఇంటి తాళం పగులగొట్టి చోరీలకు పాల్పడసాగాడు. ఈ విధంగా అభిలాష్ గత ఏడాదిన్నర కాలంలో మియాపూర్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 7 చోరీలు, గచ్చిబౌలి పరిధిలో 4, కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 దొంగతనాలకు పాల్పడ్డాడు. పోలీసులు తనను పసిగట్టకుండా దొంగతనం జరిగిన ప్రాంతంలో ఎటువంటి వస్తువులను కదిలించకుండా చోరీలకు పాల్పడేవాడు. దొంగతనం చేసిన వెంటనే ఇతర ప్రాంతాలకు వెళ్లి కొన్ని రోజులు గడిపేవాడు. దొంగిలించిన సొత్తును జైసింగ్ అనే వ్యక్తికి విక్రయించి వచ్చిన డబ్బుతో జల్సాలు చేయసాగాడు. కాగా మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న వరుస చోరీలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 16లక్షల రూపాయల విలువైన 26తులాల బంగారు ఆభరణాలు, 300 గ్రాముల వెండి, 2ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న మియాపూర్ పోలీసులను డిసిపి అభినందించారు.

## సెల్‌ఫోన్ కోసం గుర్తుతెలియని వ్యక్తిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్

**కంటోన్మెంట్, జనవరి 11 ప్రభాతవార్తః**

సెల్‌ఫోన్ కోసం గుర్తుతెలియని వ్యక్తిని హత్యచేసిన నిందితుడిని కాచిగూడ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో రైల్వేస్ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ వివరించారు. హైదరాబాద్ ఛాదర్‌ఘాట్ ఆజాంపూరా చమాన్ వద్ద నివాసం ఉండే మహ్మద్ ఖాజా మోహినుద్దీన్ కుమారుడు మహ్మద్ సోహేల్ (24) లేబర్‌గా పనిచేసేవాడు. ఈనెల 6న మలక్‌పేట్ రైల్వేస్టేషన్‌లో తెల్లవారు జామున 3ః30 గంటలకు 40 సంవత్సరాల గుర్తుతెలియన వ్యక్తి వద్ద నుండి సెల్‌ఫోన్ దొంగిలించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో అతన్ని కత్తితో పొడిచి చంపాడు. దొంగిలించిన ఫోన్‌ను ఎంజీబీఎస్ బస్టాండ్‌లో రూ. 17 వందలకు విక్రహించాడు. కాగా గురువారం ఉదయం 6ః30 గంటలకు అనుమానస్పదంగా యాకుత్‌పూరా రైల్వేస్టేషన్‌లో తిరుగుతుండగా అనుమానం వచ్చి రైల్వేపోలీసులు విచారించగా హత్యకేసు వెలుగులో నిందితుడిగా గుర్తించారు. హత్యకోసం ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అయితే నింధితుడు షాయినాయత్‌గంజ్, ఛాదర్‌ఘాట్, మీర్‌చౌక్, దబీర్‌పురా, కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో పలు కేసులలో నిందితుడు. హత్యకు గురైన వ్యక్త వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## నగర శివార్లలో రౌడీషీటర్ దారుణ హత్య

**సరూర్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త:** హైదరాబాద్ నగర శివార్లలో ఓ రౌడీషీటర్ అత్యంత దారుణంగా హత్యకు గురయ్యాడు. దాదాపు 20కి పైగా కేసుల్లో నిందితునిగా ఉన్న సదరు రౌడీషీటర్‌ను ప్రత్యర్థులు విచక్షణారహితంగా కత్తులతో పొడవడమే కాకుండా ఏకంగా మర్మాంగాలు కోసి దారుణంగా కడతేర్చారు. తీవ్ర కలకలం రేపిన ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. జల్‌పల్లి మున్సిపాలిటీలో పరిధిలోని కొత్తపేట్ అబూబాకర్ కాలనీకి చెందిన మహ్మద్ ముబారక్ సిగార్ (32) బాలాపూర్ పిఎస్‌లో రౌడీషీటర్‌గా నమోదై ఉన్నాడు. ఇతనిపై దాదాపు 20కి పైగా కేసులు ఉన్నాయి. అయితే బుధవారం అర్ధరాత్రి సమయంలో షాహీన్‌నగర్ సమీపంలోని వాది-ఎ-ముస్తఫా జరిగిన ఘర్షణలో ప్రత్యర్థులు ముబారక్ సిగార్‌పై ఒకసారిగా కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచారు. ఈ దాడుల్లో నిందితులు సిగార్ మర్మాంగాలు కోసి హతమార్చి పరారయ్యారు. అయితే మృతుడు సోదరుడు అమీర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలాపూర్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేసు_న్నారు. వేరే పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లుగా నమోదైన ఉన్న తోటి రౌడీషీటర్లే ఈ ఘాతుకానికి పాల్పడ్డ సమాచారం. సంఘటనా ప్రాంతానికి చేరుకున్న డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం బృందాలు విచారణ జరిపాయి. హత్యకు గురైన రౌడీషీటర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్యకు గల కారణాలపై బాలాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో త్వరలో పార్కింగ్ ఫీజులు వసూలు

## -టిఎస్ఆర్‌టిసి నిబంధనలను వ్యతిరేకిస్తున్న వాహనాదారులు

**అఫ్జల్‌గంజ్, జనవరి 11ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు టిఎస్ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తుంటే. మరోవైపు టిఎస్ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ సజ్జన్నార్ మాత్రం మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లోనే ఎలాంటి టెండర్లు నిర్వహించకుండా ఢీల్లి ప్రాంతానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు నామినేషన్ కింద మహాత్మాగాంధీ. బస్‌స్టేషన్‌లో డిజిటల్‌లేషన్ పేరిట వాహనాదారుల నుంచి టోల్స్‌టాక్సీ వసూలుకు అనుమతి ఎలా ఇస్తారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. టోల్స్‌టాక్సీ విధానాన్ని త్వరలోనే మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌కు వచ్చే ద్విచక్రవాహనాదారులు, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలను వసూలు చేయడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఆర్‌టిసి అధికారులు పేర్కొంటున్నారు. మహాత్మాగాంధీబస్‌స్టేషన్ లోనికి రావడం, బయటకు వెళ్లే దారి మాత్రమే ఖరారు చేసినట్లు తెలిసింది. మహాత్మాగాంధీబస్‌స్టేషన్‌లో ఉన్న మెట్రోరైల్ ఎక్కాలంటే ఈ దారి నుంచే వెళ్లాలి. బస్‌స్టేషన్‌ను అనుకుని ఉన్న గ్యాస్, శ్మశాసన వాటిక కూడా ఇక్కడే ఉంది. వారు కూడా వాహనాలపై వస్తుంటారు. వారి నుంచి టోల్స్‌టాక్సీ వసూలు చేస్తార అని టిఎస్ఆర్‌టిసిని ప్రశ్నిస్తున్నారు. ఎయిర్ పోర్ట్ తరహాలో అమలు సాధ్యమవుతుందా అనే అనుమానం కలుగుతుంది. ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించేందుకుగానుఎక్కువ శాతం మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ప్రయాణికులు ఆటోరిక్షాలు, ద్విచక్రవాహనాలల్లో వస్తుంటారు. ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి తన భార్యను ఊరికి బస్సు ఎక్కించేందుకు వస్తాడు. టోల్స్‌టాక్సీ పేరిట వాహనదారుల నుంచి వసూలు చేస్తుంటారు. మహాత్మాగాంధీ బస్ స్టేషన్‌లో నాలుగు పార్కింగ్ స్థలాలు ఉన్నాయి. డిజిటలైషన్ మాడ్రన్ అంటూ పార్కింగ్ నడుపుతున్న వారికి నోటీసులు ఇచ్చి రద్దు చేస్తున్నట్లు ఆర్‌టిసి అధికారులు తెలిపినట్లు పార్కింగ్ కాంట్రాక్టర్లు తెలిపారు. గతంలో ఆర్‌టిసి అధికారులు కేవలం తమకు స్థలం మాత్రమే ఇచ్చారని అందులో తాము షేడ్లు వేయించుకుని పార్కింగ్ నడిపించినట్లు చెప్పారు. ఆర్‌టిసి అధికారులు డిజిటలైషన్ పేరిట రద్దు చేశారు. ఎందుకు టెండర్లు పిలువ ఇవ్వకుండా ఢీల్లికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు నామినేషన్ పేరిట ఎలా పార్కింగ్ కాంట్రాక్ట్ ఇస్తా రని ప్రస్తుత కాంట్రాక్టర్లు ఆర్‌టిసి అధికారులను ప్రశిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించినట్లు వారు తెలిపారు. తెలంగాణ రోడు రవాణా శాఖ మంత్రి పోన్నం ప్రభాకర్‌గౌడ్‌కు విన్నవించినట్లు తెలిపారు. నియమ నిబంధనల ప్రకార ం టెండర్లు పిలువాలని తెలంగాణ ప్రభుత్వానికి విజ ్ఞప్తి చేశారు.


మహాత్మాగాంధీబస్‌స్టేషన్‌లో టోల్‌గేటు తరహాలో ఏర్పాటు చేసిన గేటు

## ట్రాఫిక్ పోలీసు స్టాల్స్ ప్రారంభించిన సిపి



మాట్లాడుతున్న నగర పోలీసు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సొసైటి ప్రతినిధులు

**బేగంబజార్, జనవరి 11 ప్రభాతవార్త:**

83వ. అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శనలో భాగంగా నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ప్రతి యేటా మాదిరిగానే ఈయేడు కూడా నగర పోలీసు ఆద్వర్యంలో ట్రాఫిక్ పోలీసు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ స్టాల్స్‌ను నగర పోలీస్‌కమీషనర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు పోలీస్ కమీషనర్ విశ్వప్రసాద్, జాయింట్ కమీషనర్ ఎ.వి.రంగనాథ్, డిసిపిలు సుబ్బారాయుడు, శరత్‌చంద్రపవార్, ఎన్.అశోక్ కుమార్, దార కవిత, సొసైటి కార్యదర్శి హన్‌మంత్‌రావు, సొసైటి ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలు అల్లుకున్న గీతాలే జానపదులు : సుద్దాల అశోక్‌తేజ

**రవీంద్రభారతి, జనవరి 11 ప్రభాతవార్త :**

ప్రజలు అల్లుకున్న, రాసుకున్న గీతాలే జానపదులని, ఆ గీతాలను సేకరించి, తగిన బాణీలను సమకూర్చడంలో ప్రఖ్యాతురాలు అసమాన అనుసూయ అని ప్రముఖ సినీగేయ రచయిత డా. సుద్దాల అశోక్‌తేజ అన్నారు. జానపదానికి వయస్సే లేదని, అవి ఎంతో ప్రాచీనమైనవని, వీటికి సంగీతాన్ని ప్రకృతే సమకూరుస్తుందని, రచయితలు వీటిని జాతికి అంకితం చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, దీపాంజలి సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి రెండవ అంతస్తులోని ప్రివ్యూ థియేటర్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఫిల్మ్‌మేకర్ సీతారత్నాకర్ కాంసెప్ట్, దర్శకత్వంలో రూపొందిన అసమాన అనుసూయ చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సుద్దాల అశోక్‌తేజ విశిష్ట అతిథులు డా. మామిడి హరికృష్ణ, డా. ఓలేటి పార్వతీశం, డా. రెంటాల జయదేవ్, ఐనంపూటి శ్రీలక్ష్మి, డి.సురేఖామూర్తి, దీపికారెడ్డి తదితరులతో కలిసి ప్రఖ్యాత గాయని వేదవతి ప్రభాకర్‌రావును, ప్రఖ్యాన నృత్యకారిణి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత రత్నపాప, ఫిల్మ్‌మేకర్ సీతారత్నాకర్‌లను ఘనంగా సత్కరించారు.


డా. వేదవతి ప్రభాకర్‌రావును సత్కరిస్తున్న అశోక్‌తేజ, మామిడిహరికృష్ణ, ఓలేటి, దీపికారెడ్డి తదితర అతిథులు

## జీవో నెంబరు 55ను వెనక్కి తీసుకోవాలంటూ విద్యార్థులు నిరసన

**మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 11 ప్రభాతవార్త :**

వ్యవసాయ విశ్వ విద్యాలయం భూములలో హైకోర్టు భవనాలు నిర్మించ వద్దంటూ గురువారం రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు తరగతులు బహిష్కరించి నిరసనకు దిగారు. జీవో నెంబరు 55ను వెంటనే రద్దు చేయాలంటూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని రాజేంద్రనగర్‌తో పాటు అన్ని వ్యవసాయ కళాశాలల్లో విద్యార్థులు నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు ఎస్.సత్యమూర్తి, ఎం.శ్రీజలు మాట్లాడుతూ ప్రేమావతిపేట్‌లో 100 భూమిని నూతన హైకోర్టు భవనానికి కేటాయించడాన్ని విద్యార్థులమంతా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వానికి గాని, హైకోర్టుకు గాని తాము వ్యతిరేకులం కాదని, అగ్రో బయో డైవర్స్ పార్క్, అగ్రో ఫారెస్ట్, సుగంధ, ఔషధ మొక్కల పరిశోధన కేంద్రాలు ఉన్న భూమిని హైకోర్టు భవన నిర్మాణానికి ఇవ్వటం బాధాకరమని వారు తెలియజేశారు. జీవో నెంబరు 55 వెనక్కి తీసుకునే వరకు తమ నిరసన కొనసాగుతుందని వారు తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు.


వ్యవసాయ విశ్వ విద్యాలయం విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

## పెండింగ్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి :ఎమ్మెల్యే తలసాని

**సంజీవరెడ్డి నగర్, జనవరి 11, ప్రభాతవార్త**

పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన అమీర్‌పేట డివిజన్‌లోని కుమ్మరి బస్తీలో వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పర్యవేక్షించారు. స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుమ్మరి బస్తీకి మంజూరైన వాటర్, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవలని వాటర్ వర్క్స్ అధికారులకు ఆదేశించారు. ఈ పనులు పూర్తయితేనే రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో కోట్లాది రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. పనులలో కొన్ని పూర్తికాగా, మరికొన్ని ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేయడం జరిగిందన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయినందున వీలైనంత త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ ఇందిర, డిఈ మోహన్, వాటర్‌వర్క్స్ జిఎం హరిశంకర్, ఎఎంఒహెచ్ డాక్టర్ ప్రవీణ, స్ట్రీట్‌లైట్స్ డిఇ కిరణ్మయి, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు హన్మంతరావు, జనరల్ సెక్రటరీ సంతోష్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, అశోక్‌యాదవ్, కూతురు నర్సింహా, టిల్లు, గోపిలాల్ చౌహాన్, హరిసింగ్, ఉత్తమ్‌కుమార్, గులాబ్‌సింగ్, సుమిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

**నిజాంపేట్, జనవరి 11, ప్రభాతవార్త :**

నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో సర్వే నెంబర్ 191లో బస్టాండును సైతం ఆక్రమించి అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న భూ కబ్జాదారులపైనిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ కన్నెర చేసింది. గురువారం ఉదయం టౌన్ ప్లానింగ్ అధికారిని ప్రశాంతి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది సదరు అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. అక్రమ నిర్మాణాలకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ప్రభుత్వపరంగా తగు చర్యలు చేపడతామని సంబంధిత అధికారులు హెచ్చరించారు.


టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రశాంతి ఆధ్వర్యంలో కూలుస్తున్న అక్రమ నిర్మాణాలు

## పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసిన వారికే ఓట్లు వేస్తాం : శంకర్ రావ్



పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద నిరాహార దీక్షలో ప్రసంగిస్తున్న మజ్దూర్ యూనియన్ నేత శంకర్ రావ్ తదితరులు

**అడ్డగుట్ట,జనవరి 11 ప్రభాతవార్త:**
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే వారికే వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఓట్లు వేస్తామని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కాంమ్రేడ్ సి.హెచ్.శంకర్ రావ్ పిలుపునిచ్చారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఆర్ఎఫ్.పిలుపు మేరకు గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయం వద్ద నిర్వహించిన ఎస్.సి. ఆర్.మజ్దూర్ యూనియన్ చేపట్టిన నిరాహార దీక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసే వరకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులంతా పోరాటం చేయాలన్నారు. లోక్ సభ ఎన్నికల లోపు నూతన పెన్షన్ విధానాన్నిరద్దు చేయకపోతే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కె.శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీధర్, అదనపు కార్యదర్శులు ఉదయ భాస్కర్, రామక్రిష్ణ, కోశాధికారి సరోజిని రెడ్డి, సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి రవిందర్, మజ్దూర్ యూనియన్ నాయకులు వరప్రసాద్, ఖాజా బాబా, స్వామి, నర్సింహ్మారెడ్డి, యుగంధర్, బాలక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భక్తులకు అన్నదానం చేయడం ఎంతో మేలు : జంపనప్రతాప్**

**కంటోన్మెంట్,జనవరి 11 ప్రభాతవార్త:** ప్రతి నెల అమావాస్యను పురస్కరించుకొని అమ్మవారి ప్రసాదంను భక్తులకు వితరణ చేయడం ఎంతో మంచిదని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని 1వ వార్డు బాపూజీ నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ దేవాలయం, 6వ వార్డులోని కట్టమైసమ్మ దేవాలయాల్లో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ దైవ కార్యక్రమంలో ఎల్లప్పుడు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గయ్య, రామారావు, ప్రేమ్‌కుమార్, అజిత్ కళ్యాణ్, నర్సింహ్మా,జాజుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు గాలి పటాలను అందజేసిన జంపన**

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కంటోన్మెంట్ 1,3 వార్డులలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు, ఆయా కాలనీల్లో నివాసం ఉంటున్న చిన్నారులకు, కాలనీ వాసులకు, గురువారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ గాలిపటాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ షెడ్రక్ పాల్గొన్నారు.

## అక్రమంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఆక్రమించుకుంటే కఠిన చర్యలు : పద్మసుందరి



అడ్డగుట్ట ఏసిఎస్ నగర్‌లో అక్రమంగా డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో చేరిన వారిని బయటకు పంపించిన మారేడ్‌పల్లి తహశీల్దార్ పద్మసుందరి

**అడ్డగుట్ట,జనవరి 11 ప్రభాతవార్త:**
ఇండ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిబంధనలకు విరుద్ధంగా,అక్రమంగా ఆక్రమించుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మారేడ్‌పల్లి తహశీల్దార్ పద్మసుందరి హెచ్చరించారు. అడ్డగుట్ట డివిజన్ ఏసిఎస్ నగర్‌లో ప్రభుత్వం స్థానిక లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించింది. అయితే కొందరి వ్యక్తులకు ఎసదరు ఫ్లాట్లను అలాట్ చేయకపోయినా తాళాలు పగులగొట్టి అక్రమంగా చొరబడ్డారని ఎసమాచారం అందింది. విషయం తెలుసుకున్న తహశీల్దార్ పద్మఎసుందరి బస్తీలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లల్లో నాలుగు ఇండ్లలో అక్రమంగా చేరిన వారిని బయటికి పంపించి తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆర్.ఐ.రాధిక తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసుల ఆత్మ బంధువు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్

**-అధ్యక్షుడు సాగబోయిన పాపారావు**



ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ కుతాడి అర్జున్ రావు చిత్రంలో పాపారావు

**తార్నాక, జనవరి 11 ప్రభాతవార్త:**
ఆదివాసుల ఆత్మ బంధువు ప్రొ.హైమన్ డార్ఫ్ అని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాగబోయిన పాపారావు పేర్కొన్నారు. ఒ.యూ ఆర్ట్స్‌కాలేజ్ ఎదుట ఎఎస్‌యూ వర్కింగ్ ప్రెసిడెంట్ పాపారావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్ట్స్‌కాలేజ్ సోషల్ సైన్స్ డీన్ ప్రొ.కుతాడి అర్జున్‌రావు హైజరై ప్రొ.హైమన్ డార్ఫ్ చిత్రపటానికి పాపారావుతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆస్ట్రేలియా నుంచివచ్చిన హైమన్ డార్ఫ్ ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలపై అధ్యయనం చేసేందుకు ఇక్కడికి వచ్చారని ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గౌరిగేని ప్రవీణ్ కుమార్, బొచ్చు నరేష్, ఐపతిరావు, కల్తి వెంకన్న, సురేష్, కోరెంత సుగుణ, గడెం ప్రవీణ్, రేసు భావణ, తొడసం శ్రీవాణి, పెందూరు సోనాలి, డా. బొమ్మెర సమ్మన్న, వర్షిత్ రెడ్డి, శాస్త్రీ తధితరులు పాల్గొన్నారు.

**సమాచార హక్కు పరిరక్షణ కమిటి ప్రధాన కార్యదర్శిగా చంటి ముదిరాజ్ నియామకం**

**సైఫాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** సమాచార హక్కు పరిరక్షణ కమిటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ నియమితులైనారు. ఈ మేరకు గురువారం కమిటీ జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్‌ముదిరాజ్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఎలిగేండ్ల వెంకటేష్‌ముదిరాజ్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చంటిముదిరాజ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ నియమనిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి బయటకు తీస్తూ, సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను చేపడతానని చెప్పారు.

# రెండవసారి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

**నిజాంపేట్, జనవరి 11, ప్రభాతవార్త**
భారత ప్రభుత్వ గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ విడుదల చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ 2023కుగాను తెలంగాణ రాష్ట్రం 4 అవార్డులను దక్కించుకుంది. అందులో జాతీయస్థాయిలో ఒకటి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాగా జోనల్ స్థాయిలో మూడు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, నిజాంపేట్ మున్సిపాలిటీ కార్పొరేషన్, సిద్దిపేట మున్సిపాలిటీలు అవార్డులను దక్కించుకున్నాయి. గురువారం దేశ రాజధాని న్యూఢిల్లీలో భారత్ మండపం, ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్ (ఐటిపిఒ), ప్రగతి మైదాన్‌లో అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రి, గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌పురి, రాష్ట్రమంత్రి గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖమంత్రి కౌశల్ కిషక్షర్ సమక్షంలో గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కార్యదర్శి మనోజ్ జోషి చేతుల మీదుగా మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి, సిడిఎంఎ అడిషనల్ డైరెక్టర్ జాన్ శాంసన్, జిహెచ్ఎంసి కమీషనర్ రోనాల్డ్ రాస్, కమీషనర్ రామకృష్ణరావుతో కలిసి స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండవసారి జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డ్ రావడం చాలా సంతోషంగా ఉందని, పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్నామన్నారు. ఇదే ఉత్సాహంతో రాబోయే కాలంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషని క్లీన్ అండ్ గ్రీన్, మెడ్రన్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తామని తెలియజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కార్యక్రమ నిర్వహణకు, అదేవిధంగా కార్పొరేషన్ అభివృద్ధికి ఎప్పటికప్పుడు తమ సలహాలు, సూచనలు, సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేషన్ 33 డివిజన్ల కార్పోరేటర్లకు, కో ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసి ఆయా విభాగాల అధికారులకు, సిబ్బందికి, శానిటేషన్ కార్మికులకు, సఫాయి మిత్రులకు పేరుపేరునా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును అందుకుంటున్న మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి

# ప్రభుత్వ ఉద్యోగుల పోస్టింగులు, ప్రమోషన్లలో బిసిలకు సామాజిక న్యాయం పాటించాలి

**-బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్**



బిసి ఉద్యోగ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న జాజులశ్రీనివాస్‌గౌడ్, బాలచారి, చంద్రశేఖర్‌గౌడ్ తదితర అతిథులు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జనవరి 11 ప్రభాతవార్త :**
తెలంగాణ బిసి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో బిసి ఉద్యోగుల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులు, ప్రమోషన్లలో రాష్ట్ర జనాభాలో 60శాతమున్న బిసిలకు జనాభా ప్రాతిపదిక పద్ధతిలో సామాజిక న్యాయం దక్కాలిందేనని స్పష్టం చేశారు. బిసి ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కు కోసం, ప్రమోషన్లలో రిజర్వేషన్ల సాధన, క్రిమిలేకర్ తొలగింపు తదితర సమస్యల పరిష్కారం కోసం బిసి ఉద్యోగులంతా కులాల, యూనియన్ల వారీగా విడిపోకుండా సంఘటితమై లక్ష్యసాధన దిశగా ముందుకెళ్లాలని, ప్రభుత్వంలోని వివిధ కార్పొరేషన్లలో పనిచేస్తున్న బిసి ఉద్యోగులందరూ సంఘంలో చేరాలని పిలుపునిచ్చారు. ఇతర సంఘాల్లాగానే బిసి ఉద్యోగుల సంఘానికి ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపునివ్వాలని, జనాభా దామాషా ప్రకారం బిసిల విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలని జాజుల డిమాండ్‌చేస్తూ మూడునెలలో పదివేల మందిర బిసి ఉద్యోగ సఃఘాల ప్రతినిధులతో హైదరాబాద్‌లో భారీయెత్తున జాతీయ ఒబిసి ఉద్యోగుల మహాసభను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.బాలచారి, ఎం.చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు బిక్షపతి, కె.రామరాజు, వంశీధర్, ప్రేమ్‌సాగర్, మహేంద్రసాగర్, మల్లికార్జునయాదవ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : ఎమ్మెల్సీ దయానంద్

**కంటోన్మెంట్,జనవరి 11 ప్రభాతవార్త:** అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని, అందువల్ల ఆకలి మంటలతో అలమటిస్తున్న పేద ప్రజలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్త తెలిపారు. అమావాస్యను పురస్కరించుకొని వాసవి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కంటోన్మెంట్ 5వ వార్డు వాసవి కాలనీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్‌గుప్తతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి సేవా సమితి ప్రతినిధులు మునిగండ్ల శ్రీనివాస్, గౌరిశెట్టి రాంబాబు, అమర్‌నాథ్, లింగేశ్, అజయ్, గంప చంద్రశేఖర్, శ్రీనివాస్,రాఖేశ్ తదితరులు పాల్గొన్నారు.

**1వ వార్డులో.. :** అమావాస్యను పురస్కరించుకొని కంటోన్మెంట్ 1వ వార్డు పెద్దతోకట్టలోని ముత్యాలమ్మ దేవాలయంలో బిఆర్ఎస్ నేత ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్ యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు నంద కిషోర్, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్, సదానంద్ గౌడ్,కుమార్, భారతీ తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ అంథోనీ విద్యా సంస్థలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు..

**పేట్ బీరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త**
సెయింట్ అంథోనీ విద్యాసంస్థలలో గురువారం ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. విద్యార్థులు సంక్రాంతి పండుగ సందర్భంగా రైతు, గ్రామీణ వేషధారణలో పాల్గొని తెలుగు సంప్రదాయం గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బాలురకు గాలి పటములు పోటీలు నిర్వహించారు. బాలబాలికలతో సంక్రాంతి సందర్భంగా తెలుగు సంప్రదాయంతో నృత్య ప్రదర్శన చేసారు విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఓబన్న జయంతి వేడుకలు..

**కొంపల్లి, జనవరి 11, ప్రభాతవార్త**
కొంపల్లి మున్సిపాలిటీలో గురువారం వడ్డెర సంఘం వారి ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న 217వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి వడ్డెర ఓబన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు బాలయ్య, తిరుపతి, వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు రాముగౌడ్, ఆంజనేయులు ముదిరాజ్, శ్రీను ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బైకుదొంగలు అరెస్ట్



బైకు దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు

**ముషీరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త:** బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను ముషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముషీరాబాద్ సీఐ డి.వెంకటరెడ్డి తెలిపిన కథనం ప్రకారం సికింద్రాబాద్‌కు చెందిన మహ్మద్ ముబిన్(23), బోరబండకు చెందిన మహ్మద్ ఇంతియాజ్ పాషా (20), భోలక్‌పూర్‌కు చెందిన ముస్తాఫా అలీ (20) అనే ముగ్గురు యువకులు పార్కు చేసి ఉన్న బైకులను దొంగిలించి ముషీరాబాద్ బంగ్లాదేశ్‌మార్కెట్‌కు చెందిన మహ్మద్ అబ్రర్ హుస్సేన్ (23), రిజ్వాన్ అలీ(21), అబ్దుల్ సలాం (34) అనే స్క్రాప్ వ్యాపారులకు అమ్ముతూ ఉన్నారు. బైకులు పోగొట్టుకున్న బాధితుల నుండి ఫిర్యాదులు అందుకున్న పోలీసులు నిర్దిష్టమైన సమాచారం మేరకు వీరిపై నిఘా పెట్టి బుధవారం రాత్రి భోలక్‌పూర్‌లోని వైట్ హౌస్ వద్ద వీరిని పట్టుకుని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారి వద్ద నుండి మూడు బైకులకు సంబంధించిన స్క్రాప్ మరియు ఒక బైకు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## పిట్టి కేసులో వ్యక్తికి రెండు రోజుల జైలు

**తార్నాక, జనవరి 11 ప్రభాతవార్త:** ట్రాఫిక్ పోలీసులతో వాగ్వాదం...విధులకు ఆటంకం కల్గించిన ఓ వ్యాపారికి కోర్టు రెండు రోజుల జైలు విధించింది... ఒ.యూ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు కథనం ప్రకారం.. హబ్సిగూడ స్ట్రీట్ నెం.8లో ఫుట్‌పాత్‌లు, పార్కింగ్ ప్రాంతాల్లో వ్యాపారాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కల్గిస్తున్నారు. ఈ క్రమంలో నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు ఫుట్‌పాత్‌లపై వెలసిన వాటిని మంగళవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో హబ్సిగూడకు చెందిన పుల్లగూర సూర్యనారాయణ (30)షాపు ముందు ఉన్న వస్తువులను కూడ తొలగిస్తుండగా పోలీసు సిబ్బందిపై ఆయన బూతు మాటలు తిడుతూ భీభత్సం సృష్టించాడు. దీంతో వారు ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గురువారం 8 ఎంఎం స్పెషల్ కోర్టులో సూర్యనారాయణను హాజరుపరుచగా మెజిస్ట్రేట్ పద్మజ అతనికి రెండు రోజుల జైలుతో పాటు రూ.50 జరిమానా విధించారు.

## చైన్ స్నాచింగ్ పాల్పడే నిందితుడి అరెస్ట్

**కంటోన్మెంట్, జనవరి 11 ప్రభాతవార్త:** నడుస్తున్న రైలులో నుండి చైన్ స్నాచింగ్‌కు పాల్పడే వ్యక్తిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ రైల్వే ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వేస్ అడిషనల్ డీజీ మహేష్ భగవత్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సికింద్రాబాద్ న్యూబోయిగూడలో నివాసం ఉండే రాఘవులు కుమారుడు చిన్నయ్య వీర రాఘవులు ఆకాశ్ (23) జెప్టో డెలివరి బాయ్‌గా పనిచేసేవాడు. బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న చిన్నయ్యను అదుపులోకి తీసుకొని విచారించగా నడుస్తున్న రైలులో కిటికి వద్ద కూర్చున్న మహిళ ప్రయాణికుల వద్ద నుండి మెడలోని గొలుసులను తెంపు కుంటాడు. అప్పటికే రైలు వేగంగా ఉండడంతో నిందితుడు తేలిగ్గా తప్పించుకునేవాడు. 5 కేసుల్లో నిందితుడిగా ఉన్న ఇతని వద్ద నుండి 14 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు గంజాయికి అలవాటు పడి నేరాలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బిజెపికి మాజీ మంత్రి ముకేశ్‌గౌడ్ కుమారుడు రాజీనామా

**హైదరాబాద్, జనవరి 11ప్రభాతవార్త**



విక్రంగౌడ్

లోక్‌సభ ఎన్నికల ముందు బిజెపికి షాక్ తగిలింది. బిజెపికు దివంగత మాజీ మంత్రి ముకేశ్ గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ రాజీనామా చేశారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన ఆయన..రాజీనామా లేఖను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి పంపించారు.పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నా విక్రమ్‌గౌడ్ గత అసెంబ్లీ ఎన్నికల్లో గోషామహల్ టిక్కెట్ ఆశించారు. కానీ అధిష్టానం ఆయనకు మొండి చెయ్యి చూపడంతో తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి విక్రమ్‌గౌడ్‌కు నచ్చజెప్పారు. తదుపరి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పిస్తారని విక్రమ్‌గౌడ్ ఆశించారు. కానీ పార్టీ నుంచి ఎటువంటి హామీ రాకపోవడంతో బిజెపిని వీడాలని డిసైడ్ అయ్యారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ రాజీనామా లేఖలో పలు అంశాలపై మాట్లాడారు.. పార్టీలో సరైన ప్రోత్సాహం లేదని..కొద్ది మందికే అన్ని పదవులు అన్నట్టుగా వ్యవహారం సాగుతోందన్నారు. గ్రూపులను కాకుండా పార్టీనే నమ్ముకున్న తనలాంటి వారికి తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్నా పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని విక్రమ్‌గౌడ్ తన లేఖలో పేర్కొన్నారు. ఆయన త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశముంది.

## ఈనెల 21న " లవ్ మై ఇండీ డాగ్‌షో "

**-బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల**

**హైదరాబాద్, జనవరి 11,ప్రభాతార్త:**
నగరంలోని మొట్టమొదటి పురాత జంతు సంక్షమ సంస్థలలో ఒకటైన బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ "లవ్ మై ఇండీ డాగ్‌షో "రెండో ఎడిషన్‌ను ప్రారంభించింది. ఈమేరకు గురువారం బ్లూక్రాస్ ఆఫ్ హైదరాబాద్ వ్యవస్థాపకురాలు అక్కినేని అమల మాట్లాడుతూ ఈనెల 21న ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు దోమలగూడలోని చైతన్య విద్యాలయంలో ఈషోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈషో ద్వారా దేశీ శునకాలపై దృష్టి దృష్టిమల్లించడం, వాటి దత్తత ప్రోత్సహించడం చేస్తామన్నారు. పెంపుడు కుక్కల జాతులతో పోలిస్తే ఈఇండీయ కుక్కలు (వీధికుక్కలు) చలా బలైమనవన్నారు.వాటికి విశ్వాసం, విధేయత చెప్పుకోదగినవిగా ఉంటాయన్నారు. కుక్కలు పెంచుకునేవారు తమ శునకాల సాహసాలను పంచుకోవడానికి ఈప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి : కొలను శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్, జనవరి 11, ప్రభాతవార్త**
అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉత్తమమైనదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు కొలను శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం టిఎస్‌యుటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం మేడ్చల్ మల్కాజగిరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను నిజాంపేటలోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల జీవితాల్లో వెలుగును నింపుతూ సమాజం కోసం ఉత్తమ పౌరులను అందిస్తున్నారన్నారు. విద్యార్థుల్లో నిక్షిప్తమై ఉన్న వివిధ రకాల నైపుణ్యాలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ కేవలం పాఠ్యాంశాల మీదనే కాకుండా సహ పాఠ్య కార్యక్రమాలలో కూడా సాంస్కృతిక, క్రీడా రంగాల్లో విద్యార్థుల ఆలోచనలకు అనుగుణంగా విద్యాబుద్దులు నేర్పుతున్న ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు.

## 2024 నూతన సంవత్సర బహుమతుల పంపిణీ

**పేట్ బషీరాబాద్, జనవరి 11, ప్రభాతవార్త :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రిస్మస్, 2024 నూతన సంవత్సర బహుమతులను ఎన్‌సిసి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, 177 ప్రెసిడెన్సీ అవెన్యూ, పేట్‌బసీరాబాద్‌లో పంపిణీ చేశారు. ఎన్‌సిసి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ శ్యాంపాల కొలక లూరి నివాసం, ఎన్‌సిసి జాతీయ పరిపాలనా కార్యాలయంలో ఈ కార్య క్రమం గురువారం జరిగింది. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు సీఎం క్రిస్మస్, నూతన సంవత్సర బహుమతులును అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ ప్రధాన కార్యదర్శి సంజీవ్ తెనాలి, జాతీయ ఉపాధ్యక్షురాలు రెవ, బ్రైటీ బ్యూలా, వ్యవస్థాపక అధ్యక్షుల కార్యాలయ సభ్యురాలు గ్రేస్ మ్యాథ్యూస్, జాతీయ బాలల విభాగం అధ్యక్షురాలు ప్రిసిల్లా, రాష్ట్ర రాజకీయ విభాగం అధ్యక్షులు పింగిళి శామ్యూల్, టిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెవ, యేసుదాస్, దైవసేవకులు సురేంద్ర, శాంత తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**నిజాంపేట్, జనవరి 11, ప్రభాతవార్త :** నేడు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు కాలనీ ఎన్‌టిఆర్ నగర్, శ్రీనివాస్ నగర్ కాలనీ, 191ప్రశాంతి హిల్స్ సబ్ స్టేషన్ నుండి 11కెవి శ్రీనివాస ఆకలనీ ఫీడర్, మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30గంటల వరకు మధురనగర్, ప్రశాంతి హిల్స్ కాలనీలలో 11కెవి ప్రశాంతి హిల్స్ ఫీడర్ నిజాంపేట్ సెక్షన్ ఆధ్వర్యంలో ఉన్నందున విద్యుత్ సరఫరా నిలి పివేస్తున్నట్లు, వినియోగదారులు ఇందుకు సహకరించాలని నిజాంపేట్ సెక్షన్ ఆపరేషన్ ఏఈ రాకేష్ తెలియజేశారు.

## జంటనగరాల్లో కార్ పూలింగ్ విధానం

**-సిపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి**

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త**
నగరంలో ట్రాఫిక్ నిబంధనలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. ఇందు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని కోరారు. ఇప్పటికే హెచ్‌సిఎస్‌సి ద్వారా పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇతర నగరాల్లో ఉన్న కార్ పూలింగ్ విధానాన్ని జంటనగరాల్లోనూ ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు సీపీ తెలిపారు. నగరంలో ప్రస్తుతం 31 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఉన్నాయని..గతంతో పోల్చితే ఈ సంఖ్య పెరిగిందన్నారు. కొత్త ఆలోచనలతో ట్రాఫిక్ సమస్యకు పరిష్కార మార్గాలు తయారు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

## రాంగోపాల్‌పేట డివిజన్‌లో సమస్యలు పరిష్కరించండి

**-జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ ఫిర్యాదు**



బేగంపేట సర్కిల్ డీసీ శంకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పోరేటర్ చీరె సుచిత్ర శ్రీకాంత్.

**బేగంపేట జనవరి 11,ప్రభాతవార్త**
సనత్ నగర్ నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ లో నెలకొన్న ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాంగోపాల్‌పేట కార్పోరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ గురువారం జీహెచ్ఎంసీ డిప్యూటీ కమీషనర్ శంకర్‌ను కల్సి లిఖిత పూర్వక ఫిర్యాదును అందజేసారు.డివిజన్ పరిధిలోని పారిశుధ్య కార్మికులు అరకొరగా విధులకు హాజరవుతున్నారని,స్వచ్ఛ ఆటోలు కూడా సరిగా తిరగడం లేదని చెప్పారు.వీధిలైట్లు కూడా 50 శాతానికి పైగా వెలగడం లేదన్నారు.పబ్లిక్ టాయిలెట్స్‌కూడా నిర్వహణ సరిగ్గా లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.జీరా,మెక్లోన్ గూడా ప్రాంతంలో పార్కు డెవలప్‌మెంట్ చాలా రోజుల క్రితం ప్రారంభమైందని,ఇప్పటి కూడా పూర్తికాలేదని చెప్పారు.గత రెండు సంవత్సరాల క్రితం సాంక్షన్ అయిన డెవలప్‌మెంట్ వర్క్‌లను కూడ ఇంత వరకు ప్రారంభించలేదని,ఆమె ఫిర్యాదులో తెలిపారు.వీటితో పాటు ప్రజా సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని కార్పోరేటర్ ఫిర్యాదులో కోరారు.

## అంగన్‌వాడీలపై ఎస్మా ఎత్తివేయాలి..డిమాండ్లు అమలు చేయాలి

**సైఫాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** నెల రోజులుగా తమ డిమాండ్ల సాధన కోసం లక్ష మందికిపైగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లుపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అప్రస్వామిక చర్యని తక్షణమే ఉపసంహరించుకోవలని తెంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, టిఎస్ శ్రామిక మహిళా ఫోరం డిమాండ్ చేశాయి. ప్రభుత్వ ఉద్యోగులపై అమలు చేసే ఎస్మా చట్టం వర్కర్లుగా ఉన్న అంగన్‌వాడీలకు ఎలా వర్తిస్తుందని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు, గ్రాడ్యూటి కోసం టీచర్స్, హెల్పర్స్ చేస్తున్న పోరాటంపై అణిచివేత చర్యలను ప్రభుత్వం మానుకోవాలని ఆ సంఘాల ప్రతినిధులు ఎన్.కరుణకుమారి, పి.ప్రేమ్‌పావని కోరారు. 2019 ఎన్నికల సందర్భంగా వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు కోసం అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్బంధవిధానాలను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. వెంటనే ఎస్మా ఎత్తివేసి డిమాండ్లను అమలు చేయాలని వారు ఎపి సిఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వారు ఒక లేఖలో విజ్ఞప్తి చేశారు.

## నీతి, నిజాయితీ, విలువలకు లాల్ బహదూర్ శాస్త్రీ నిదర్శనం

**సైఫాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** భారత రాజకీయాల్లో మాజీ ప్రధాని లాల్ బహుదూర్‌శాస్త్రీకి ప్రత్యేకమైన స్థానం ఉందని, పండిట్ జవహర్‌లాల్ నెహ్రుకు కుడిభుజంగా ఉంటూ దేశానికి విశేషమైన సేవలను అందించారని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు కొనియాడారు. శాస్త్రీ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి రాజేశ్వర్‌రావు పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో నీతి, నిజాయితీ, విలువలకు నిదర్శనం ఒక్క శాస్త్రీయేనని స్పష్టం చేశారు. రైల్ ప్రమాద దుర్ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ నాడు లాల్ బహుదూర్‌శాస్త్రీ మంత్రికి పదవికి రాజీనామా చేసి పదవులకు వన్నె తెచ్చారని గుర్తు చేశారు. ఆయన రాజకీయ జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి వేడుకలు..

**జీడిమెట్ల, జనవరి 11, ప్రభాతవార్త**
125 డివిజన్ గాజులరామారంలో గల ప్రభుత్వ పాఠశాలలో సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుత్బుల్లాపూర్ నాయకులు సొంటిరెడ్డి పున్నారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను పాఠశాల విద్యార్థులు తెలియజేయం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇదే ప్రతీ పండుగను జరుపుకోవాలని వాటి విశిష్టతను విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, చంద్రశేఖర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, ఒక్షిత్ ఎంక్లేవ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నిఘా నీడలో వెంకటాద్రి నగర్..



**జీడిమెట్ల, జనవరి 11, ప్రభాతవార్త**
వెంకటాద్రినగర్‌లో తన సొంత నిధులతో నూతనంగా ఏర్పాటు చేసి సీసీ కెమెరాలను ఎమ్మెల్యే కెపి వివేకానంద గురువారం ప్రారంభించారు. 130 సుభాష్ నగర్ డివిజన్ వెంకటాద్రి నగర్ కాలనీ ప్రజా శ్రేయస్సు, భద్రత కోసం తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన సీసీ కెమెరాలను ఎమ్మెల్యే వివేకానంద ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాలు నేరాలను అదుపు చేయడంలో, నేరాలను అరికట్టడంలో ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ సురేశ్‌రెడ్డి, ఫిషరీస్ కో ఆపరేటివ్ మేడ్చల్ జిల్లా చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలె శ్రీకాంత్, మాజీ కౌన్సిలర్ రంగారావు, సీనియర్ నాయకులు వాసు, బలరాంరెడ్డి, సాంబయ్య, వెంకటాద్రి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు లక్ష్మీ, ఉపాధ్యక్షులు వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శి అనిల్ తివారి, సంయుక్త కార్యదర్శి కె.భార్గవి, జ్యోతి, కోశాధికారి మల్లేష్, ముఖ్య సలహాదారు మహేర్ సింగ్, సలహాదారులు పవన్‌శర్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రాధా, సంధ్య, లక్ష్మీ, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అమవాస్య అన్న ప్రసాద వితరణ

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:**
అంబర్‌పేట డివిజన్‌లోని పటేల్‌నగర్‌లో న్యూ గ్రీన్ ల్యాండ్ హోటల్ వద్ద ఆర్య వైశ్య సంఘం ప్రేమ్‌నగర్ వారు నిర్వహించిన అమవాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ,కార్పోరేటర్ విజయ్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంతటి మంచి సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న నిర్వహకులను అభినందించారు.

**ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు**

తిలక్‌నగర్‌లోని ఎంఆర్‌సి చికెన్ సెంటర్ ప్రక్క వీధిలో గురువారం ఒక చెట్టు కూలిపోయింది. దీంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులకు గురైనారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హుటాహుటిన డిఆర్ఎఫ్, ఎలక్ట్రికల్ అధికారులను, సబ్బిందిని అక్కడికి పిలిపించి, చెట్టు కొమ్మలను నరికించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థుల విద్యావిధానాలపై శ్రద్ధ చూపాలి

**- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**

**కుత్బుల్లాపూర్, జనవరి 12 ప్రభాతవార్త**

ప్రతి విద్యార్థి వ్యక్తిగత అభ్యున్నతిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రత్యేకశ్రద్ధే కీలకమైందని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్‌లోని త్రివేణి స్కూల్ వార్షికోత్సవానికి స్థానిక కార్పొరేటర్ కూన పారిజాతగౌరీశ్‌గౌడ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల చైర్మెన్ కె.ఎం.గౌరీష్ అధ్యక్షతన నిర్వహించిన రెండవ వార్షికోత్సవ ఆధ్వయ2023-2024ను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి తల్లిదండ్రి వారానికోమారు తమ పిల్లల విద్యాంశాలపై ప్రత్యేకశ్రద్ధ వహించి విద్యార్థుల్లో విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలపై శ్రద్ధచూపాలన్నారు. విద్యార్థుల చదువులపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా చర్చించి వారి అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. పాఠశాల చైర్మెన్ కె.ఎం.గౌరీష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు వివిధ అంశాలపై శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ ధనలక్ష్మి మాట్లాడుతూ వినాయకచవితి, దసరా, సంక్రాంతి, బాలలదినోత్సవం వంటి అనేక అంశాలలో తల్లిదండ్రుల అభిలాష మేరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించినట్లుతెలిపారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, చలనచిత్ర గీతాలను తల్లిదండ్రులు వీక్షించారు.

### మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నూతన కార్యవర్గం నియామకం



నియామకపు పత్రాన్ని అందజేస్తున్న కొమ్ముశేఖర్ మాదిగ

**తార్నాక, జనవరి 11 ప్రభాతవార్త:**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఓ.యూలో గురువారం మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ నేతృత్వంలో మాదిగ విద్యార్థుల సమావేశాన్ని నిర్వహించి నూతన కమిటీనీ ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా మందరాజు మాదిగ, అధికార ప్రతినిధిగా లింగంపల్లి దినేష్, ప్రధాన కార్యదర్శులుగా బొబ్బిలి నవీన్, గుండాల రవితేజ, కొప్పు విష్ణు, ఉపాధ్యక్షులుగా సిద్ది శ్రీకాంత్, మంద తిరుపతి, బైకాడి ప్రవీణ్,ములుగూరి అరుణ్, దేవరపాగ నర్సింహ, సహాయ కార్యదర్శులుగా గుండ్ల నిఖిల్, నీరు కంటి కాశీ, గబ్బెట రమేష్, ప్రచార్య కార్యదర్శులుగా జూటూరి జాన్ మాదిగ, గడ్డం అశోక్, కోఆర్డినేటర్‌గా సునీల్ గవాస్కర్, ఇంచార్జి నలిమెల వంశిరాజ్ మాదిగ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ ఎంఎస్ఎఫ్‌ను సంస్థాగత నిర్మాణంలో భాగంగా కమీటీని వేసినట్లు చెప్పారు.

### ప్రవళికను అభినందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



ప్రవళికను అభినందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

**సికింద్రాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:**

సీతాఫల్‌మండి మేడిబావికి చెందిన సాఫ్ట బాల్ యువ క్రీడాకారిని సీహెచ్. ప్రవళిక సౌత్‌జోన్ సాఫ్ట్ బాల్ బాలికల ఛాంపియన్షిప్ పోటీలకు ఎంపికైంది. ఈనెల 12 వ తేదీ నుంచి జనగాంలో వివిధ దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సాఫ్ట్ బాల్ క్రీడాకారుల ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో పంజాబ్‌లోని లవ్లీ యూనివర్సిటీలో ఆమే విద్యాభ్యాసం సాగిస్తూ అంతర్జాతీయ స్థాయి పోటీల్లో కూడా పాల్గొంటోంది. ప్రవళికన అభినందించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ఆమే తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

### ఆకట్టుకున్న "క్షీరసాగర మధనం నృత్యరూపక ప్రదర్శన "



నృత్యరూపక ప్రదర్శన దృశ్యం

**హైదరాబాద్,జనవరి 11,ప్రభాతవార్త:**

ప్రముఖ నృత్యగురువు దివంగత పద్మభూషణ్ డాక్టర్ వెంపాటి చిన సత్యం జ్ఞాపకార్థం అభినవవాణి నృత్యనికేతన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు రవీంద్రభారతిలో నిర్వహించిన వెంపటి నాట్య మేధా కార్యక్రమం ముగిసింది. ఈసందర్భంగా ప్రముఖ నృత్యగురువు సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ రామలింగ శాస్త్రి మాట్లాడుతూ సాంస్కృతి సాంప్రదాయం, నృత్య వారసత్యం యొక్క వేడుక అని తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులకు శిక్షణను ఇస్తూ ఈవేడుకను కాపాడుతున్న నృత్య గురువు బాలా త్రిపుర సుందరి కృషి అభినందనీయమన్నారు. అంతకు ముందు క్షీరసాగర మదనం అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. హెచ్‌సియూ ప్రొఫెసర్ టి.అనురాధ, మాజీ ప్రధాని పి.వి నర్సింహ్మారావు కూతురు శారదాదేవి, కీర్తిరెడ్డి, గాడియం స్కూల్ వ్యవస్థాపకురాలు బాలత్రిపుర సుందరి, అభినయవాణి నృత్యకేతన్ ,సంస్థ వ్యవస్థాపకురాలు పాల్గొన్నారు.

### నగరకేంద్ర గ్రంథాలయంలో క్యాలెండర్ ఆవిష్కరణ

**చిక్కడపల్లి, జనవరి 11 ప్రభాతవార్త:** తెలుగు రాజ్యం కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం గురువారం అశోక్‌నగర్ నగరకేంద్ర గ్రంథాలయంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ప్రసంగించారు.నిర్వాహక సంస్థఅధినేత గోపరాజు రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు రఘుశ్రీ, తంగెళ్లపల్లి కనకాచారి,కోదాటి అరుణ, ఎం.సురేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఫౌండేషన్ తరపున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించి పేదలకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత బాలగంగాధరయ్య రచించిన 35వ పుస్తకం 'భానుతేజం'ను ఆవిష్కరించారు తొలుత ఫ్రీ బస్‌మహిళల ఆత్మగౌరవంపై నిర్వహించినకవిసమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొనితమ అమూల్యమైన కవితలను వినిపించారు.

### జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**చిక్కడపల్లి, జనవరి 11 ప్రభాతవార్త:** జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్(టీజేసీపీడీఏ) నూత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బి.లక్ష్మయ్య, ఎం.పర్వతాలు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బి.లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రస్తుతం పాలమూరు విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ ఒక సమర్థవంతంగా బాధ్యత చేపట్టిన తరుణంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఫిజికల్ డైరెక్టర్‌లకు అవకాశం ఇవ్వడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందిది ఏమిటని ప్రశ్నించారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్‌లకు ప్రమోషన్ ద్వారా జూనియర్ కాలేజీలో పీడీలకు అవకాశం కల్పించాలని కోరారు.

# నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నాం : మేయర్ మహేందర్‌గౌడ్

**నార్సింగి, జనవరి 11 ప్రభాతవార్త :**

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలో నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తున్నామని మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం కార్పోరేషన్ పరిధిలోని ఎర్రకుంట వద్ద నిర్మించిన 10.లక్షల లీటర్ల రిజర్వాయర్ నుంచి నీటిని ట్రయల్ రన్ చేసి పరిశీలించారు. జల మండలి జీఎం రవీందర్‌రెడ్డితో కలిసి మేయర్ ఈ పనులను పరిశీలించారు. వీరభద్ర కాలనీ, సరస్వతీ కాలనీ, ఆదర్శనగర్, డిడి కాలనీ, వినాయక్‌నగర్, యాదవ్‌మిత్ర కాలనీలలో నీటిని కుళాయిల ద్వారా పంపిణీ చేసి పరీక్షించారు. ఈ సందర్భంగా మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ బండ్లగూడ కార్పోరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో నీటి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. ప్రణాళికబద్ధంగా రిజర్వాయర్లను నిర్మించి, వాటర్ పైప్‌లైన్‌లు వేసి అధిక ప్రెషర్‌తో నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. గతంలో సంక్రాంతి పండగ దాటగానే నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చేదని, ప్రస్తుత పాలకవర్గం కొలువుతీరిన తరువాత నీటి సమస్యను పూర్తిగా తీర్చామన్నారు. మిషన్ భగీరథ ద్వారా గత సర్కారు ఇంటింటికి నీటి సరఫరా చేయడంతో సమస్య శాశ్వంతంగా పరిష్కారమయ్యిందన్నారు. అతి త్వరలోనే ఈ కొత్త రిజర్వాయర్ నుంచి మంచినీటిని సరఫరా చేసి, ప్రజలకున్న నీటి ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, డిప్యూటీ జీఎం నారాయణ, జెనరల్ మేనేజర్ శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎలమయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జలమండలి జీఎం రవీందర్‌రెడ్డితో కలిసి ఎర్రకుంట వద్ద నిర్మించిన రిజర్వాయర్ నుంచి ట్రయల్ రన్‌ను పరిశీలించిన మేయర్ మహేందర్‌గౌడ్.

## భాగ్యనగర్ టిఎన్జీఓస్ గచ్చిబౌలి మ్యాక్ హౌజింగ్ సొసైటీకి తిరిగి భూమిని కేటాయించాలి

**చిక్కడపల్లి, జనవరి 11ప్రభాతవార్త:**

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ఆధీనంలో ఉన్న భాగ్యనగర్ టిఎన్జీఓస్ గచ్చిబౌలి మ్యాక్ హౌజింగ్ సొసైటీకి సంబంధించి 1991లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం శేరిలింగంపల్లి మండలం గోపన్‌పల్లిలో కేటాయించిన భూమిని గత బిఆర్ఎస్ ప్రభుత్వం వెనక్కు తీసుకుని అన్యాయంచేసిందని, తిరిగి ఆ భూమిని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సొసైటీకి కేటాయించాలని అసోసియేషన్ కోరింది. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కనకం కొమురెల్లి, తూము అశోక్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి జి.సూర్యకల, కోశాధికారి వవి.దివాకర్, సంయుక్త కార్యదర్శి సిహెచ్‌వి.భద్రయ్య, కార్యవర్గ సభ్యులు కె.లక్ష్మణ్‌రావు, ఝాన్సీ రాణి, డి.పవన్ కుమార్, వి.రామనాథచెట్టి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ మానవతా దృక్పథంతో ఉద్యోగులకు సంబంధించిన ఇళ్ళ స్థలాలకు 1991లో కేటాయించిందని, 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే అక్రమంగా ఇళ్లు నిర్మించుకోలేదన్న నెపంతో సొసైటీకి చెందిన 189.11 ఎకరాలు వెనక్కి తీసుకుని బిఆర్ఎస్ ప్రభుత్వం తమకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని త్వరలో రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వివరించి తమకు న్యాయంచేయాలని కోరుతామన్నారు.

ఇందుకుగాను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ జారీ చేసిన మెమో 1088ను ఉపసంహరించి సర్వే నెంబర్ 36, 37లోని 189.11.ఎకరాలను భాగ్యన గర్ టిఎన్జీఓస్ గచ్చిబౌలి మ్యాక్ హౌజింగ్ సొసైటీకి తిరిగి కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## 8నెలలుగా జీతాల్లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం

**-పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోండి**

**-పశుసంవర్థక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి గోపాలమిత్ర జేఏసీ వినతి**



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న రవీందర్, అశోక్ తదితరులు

**హైదరాబాద్, జనవరి 11,ప్రభాతవార్త:**

పశుసంవర్థక శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న గోపాలమిత్రులకు గత 8నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వెంటనే చొరవ తీసుకుని తమ పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అదర్‌సిన్హాని గోపాలమిత్ర జేఏసీ కోరింది. ఈమేరకు గురువారం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మారబోయిన రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం సెక్రటరీని మర్యాదపూర్వంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈసందర్భంగా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ 2023 మేనెల నుంచి డిసెంబర్ 2023వరకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో నిత్యం గ్రామాల్లో తిరుగతూ రైతులకు చేదోడువాదోడుగా ఉండే గోపాలమిత్రుల కుటుంబాలకు గడవలేని స్థితిలో ఉన్నాయన్నారు. కావున పెండింగ్ వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్‌లో 2 వైన్‌షాపులపై క్రిమినల్ కేసులు

**హైదరాబాద్, జనవరి 11,ప్రభాతవార్త:**

నగరంలో రూల్స్‌కు విరుద్దంగా నడుపుతున్న వైన్‌షాపులపై పోలీసులు చర్యలు తీసుకున్నారు. జనవరి 11వ తేదీ గురువారం బంజారాహిల్స్‌లోని రెండు వైన్‌షాపులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పర్మిట్‌రూమ్‌లలో ఫుడ్ఐటమ్స్ తయారు చేసి అమ్ముతుండటంతో కేసులు నమోదు చేసినట్లు తెలుస్తుంది.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



హెచ్ఎఫ్ నగర్‌లో సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యాలయం వద్ద సమస్యలపై కార్పోరేటర్ సిఎన్ రెడ్డికి వినతీ పత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

**యూసుఫ్‌గూడ, జనవరి 11, ప్రభాతవార్త**

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి తగిన విధంగా కృషిచేస్తామని రహ్మత్‌నగర్ కార్పోరేటర్ సిఎన్‌రెడ్డి అన్నారు. గురువారం రహ్మత్‌నగర్ డివిజన్ పరిధిలోని హబీబ్ ఫాతిమా నగర్ జోన్ కార్యాలయం వద్ద అమావాస్య సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పోరేటర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తరపున ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి సమస్యలపై వినతీ పత్రం అందజేశారు. తమకు కార్యాలయం కోసం స్థలం కేటాయించాలని ప్రమాద భీమా కల్పించాలని కోరారు. అనంతరం వారి డైరీని కాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎమ్‌డి అసద్, భవాని శంకర్, సెంట్రింగ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎమ్‌డి హైమద్, వి.విఠల్, సయ్యద్ ఫారుక్, ముజీబ్, రహీమ్, రాజుగౌడ్, సింగారి యాదగిరి, సింగారి శ్రీను, సంఘమేష్, దశరథ్, రమేష్ నాయక్, ఎమ్‌డి ఎక్బాల్, మన్సూర్, జాఫర్ హుస్సేన్, నాగరాజు, జెపి జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## అందరి జీవితాలలో వెలుగులు నింపాలి : లక్ష్మణ్

**యూసుఫ్‌గూడ, జనవరి 11, ప్రభాతవార్త**

సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో వెలుగులు నింపాలని కిడ్స్ డైరెక్టర్ కొల్లి లక్ష్మన్ అన్నారు. గురువారం కళ్యాణ్ నగర్ పాఠశాలలో సంక్రాంతి పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈవేడుకలలో భాగంగా భోగి మంటలు, గంగిరెద్దుల ఆటలు, చిన్నారులకు భోగి పండ్లు పోయడం హరిదాసుల కోలాటాలు, గొబ్బెమ్మల ముగ్గులతో చాలా వైభవంగా సంక్రాంతి వేడుకలు జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు వారి నృత్య ప్రదర్శనతో అందరిని అలరించారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ గీతా లక్ష్మణ, కృష్ణవేణి, సుకుమార్, ప్రిన్సిపల్ గీత, వైస్ ప్రిన్సిపల్ విమల, రాజేశ్వరి, కోఆర్డినేటర్ సాయిరాం, విజయ లక్ష్మీ, సాయిశ్రీ, పూజ, శిరీష, పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న నటి తెజశ్వీ మడివాడ

## అర్థరాత్రి వరకు వ్యాపారాలకు పర్మిషన్ ఇవ్వండి

**-సీపీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎంఐఎం ఎమ్మెల్యేలు**



**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త**

ఇల్ ఇండియా మజ్లిస్ ఇ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) పార్టీ ఎమ్మెల్యేల బృందం గురువారం నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. చిరు వ్యాపారులు, హోటల్ యజమానులను నగర పోలీసులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫెకర్ ఆలీ కమిషనర్‌తో భేటీ అయ్యారు. ఈ క్రమంలో మెహిదీపట్నం, రేతిబౌలి, పత్తిరగట్టి, లాడ్‌బజార్, చార్మినార్, టోలీచౌకి, గోల్కొండ, ఆసిఫ్‌నగర్, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లోని చిరువ్యాపారులకు, వీఽధి వ్యాపారులకు ట్రాఫిక్ పోలీసులు భారీ జరిమానాలు విధిస్తున్నారని సీపీకి తెలిపారు. నగరంలోని హోటళ్లు, ఇతర వ్యాపార సంస్థలకు అర్థరాత్రి వరకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేలు సీపీ దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆరోపణలపై స్పందించిన సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేల సమస్యలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### నిజాం కళాశాలలో అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**-ఆనంద డోలికల్లో తెలియాడిన విద్యార్థులు**

**సైఫాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు అకాశాన్ని అంటాయి. వందలాది మంది ఇక్కడి విద్యార్థులతోపాటు దేశ, విదేశాలకు చెందిన విద్యార్థులు ఈ సంబరాల్లో పాలొన్నారు. ఆనంద డోలికల్లో తెలియాడారు. బుధ, గురువారాల్లో జరిగిన రంగోలి పోటీలు కళాశాలకు కొత్త అలంకరణ, కళ తెచ్చాయి. నేడు జరిగిన ఈ సంక్రాంతి కల్చరల్ ఫెస్ట్ విశేషంగా అకట్టుకుంది. ఒక వైపు అమ్మాయిలు పోటీ పడి ముగ్గులు వేస్తే, మరొకవైపు విద్యార్థులు కుండలపైన డిజైన్, కైట్స్ మేకింగ్, ఫేస్ పెయింటింగ్, ఫ్యాషన్ షో నిర్వహించి అందరిని అకట్టుకున్నారు. అంతేకాకుండా భోగి మంటలు కూడా జరిగాయి. మరి కొంత మంది విద్యార్థులు ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి, రకరకాల సంక్రాంతి పిండి వంటలను మిగతా విద్యార్థులకు, అధ్యాపకులకు రుచిచూపించారు. ఈ సందర్భంగా నగరంలోని పది కళాశాలలకు చెందిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక అలరించాయి. నిజాం కళాశాల విద్యార్థుల నిర్వహించిన ప్యాషన్ షో చూపరులను కట్టిపడేసింది. ఈ కార్య క్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సీని దర్శకుడు శేఖర్ కొమ్ముల మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వివిధ సంస్కృతిక, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ ఫెస్టలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి.బీమా, వైస్- ప్రిన్సిపల్ డా.ఉపేందర్‌రెడ్డి, నిర్వాహకులు డా.మాధవి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## అప్పు తిరిగి ఇవ్వనందుకు పండ్ల వ్యాపారిని హత్య చేసిన ఆటో డ్రైవర్

**చార్మినార్,జనవరి 11 ప్రభాతవార్త :** పాతబస్తీ జహనుమాకు చెందిన పండ్ల వ్యాపారిని హత్య చేసిన సంఘటనలో కాలాపత్తర్ పోలీసులు ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసిరిమాండ్‌కు తరలించారు.అప్పుగా తీసుకున్న 3000 వేల రూపాయలను పండ్ల వ్యాపారి అఫ్రోజ్ తిరిగి ఇవ్వ నందుకు ఆటో డ్రైవర్ షేక్ మహమూద్ అలియాస్ డాబ్లా తన స్నేహితుడైన మహ్మద్ వసీంలు కలిసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది.కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దాలినాయుడు కథనం ప్రకారం....పాతబస్తీ తీగలకుంట ప్రాంతానికి చెందిన షేక్ అఫ్రోజ్ (48) వృత్తి రీత్యా పండ్ల వ్యాపారి.వట్టెపల్లికి చెందిన షేక్ మహమూద్ అలియాస్ డాబ్లా ఆటో డ్రైవర్ (40).కొంత కాలం క్రితం డాబ్లా వద్ద అఫ్రోజ్ అప్పుగా మూడు వేల రూపాయలు తీసుకున్నాడు.అఫ్రోజ్ అప్పుగా తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వ లేదు.ఈ విషయంలో వారిద్దరి మధ్య గొడవ జరిగింది.ఇద్దరు వ్యక్తి గతంగా తిట్టుకున్నారు.ఈ నెల 6వ తేదీ అర్ధరాత్రి 12 గంటల సమయంలో షేక్ అఫ్రోజ్ తాడ్‌బన్ చౌరస్తా నుంచి నవాబ్ సాహెబ్‌కుంట ప్రాంతానికి వెళుతున్నాడు.అదే సమయంలో షేక్ మహమూద్ అలియాస్ డాబ్లా తన స్నేహితుడైన ఫాతిమానగర్‌కు చెందిన మహ్మద్ వసీం (22)తో కలిసి తాడ్‌బన్ చౌరస్తాకు వస్తున్నారు.స్థానిక చెత్త కుండి రహదారిలో ఇద్దరు మధ్య వివాదం జరిగింది.షేక్ మహమూద్ అలియాస్ డాబ్లా,మహ్మద్ వసీంలు కత్తితో పండ్ల వ్యాపారి షేక్ అఫ్రోజ్ గుండె మీద పొడిచారు.ఈ సంఘటనలో తీవ్ర గాయాల పాలైన అఫ్రోజ్ అక్కడకక్కడే మృతి చెందాడు.పండ్ల వ్యాపారి మహ్మద్ అ ఫ్రోజ్‌ను హత్య చేసిన ఆటో డ్రైవర్ మహమూద్ అలియా బిడ్లా,మహ్మద్ వసీంలను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.నింధితుల వద్ద నుంచి హత్య చేయటానికి ఉపయోగించిన కత్తి,ఆటో,సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును కాలాపత్తర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

**జీడిమెట్ల, జనవరి 11, ప్రభాతవార్త**

రాజీవ్ గృహకల్ప సముదాయంలో భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ఫర్జానా (35) ప్రైవేట్ టీచర్‌గా పని చేస్తుంది. భర్త ఎస్‌కె ఖదీర్ మద్యం మత్తులో వేధింపులకు గురిచేయడంతో మనస్థాపంతో ఊరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పది రోజుల క్రితమే భార్యభర్తలకు పోలీసుల కౌన్సిలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. మృతురలి కుమార్తె స్కూల్ ఫీజు, ఇంటి సామానుల విషయంలో గొడవ జరిగినట్లు తెలుస్తుంది. ఎస్‌కె ఖదీర్‌ను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సురారం పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అంబేద్కర్ కళాశాలలో సంక్రాంతి సంబురాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అంబేద్కర్ విద్యాసంస్థల కార్యదర్శి, ఎమ్మెల్యే గడ్డం వినోద్

**చిక్కడపల్లి, జనవరి 11 ప్రభాతవార్త:**

బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో సంక్రాంతి సంబురాలు గురువారం ఘనంగా జరిగాయి. ఆటపాటలతో హోరెత్తించిన యువతీ, యువకులు, చిన్నారులు, మహిళలు రంగవల్లులు, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ఆలవాలమైన సంక్రాంతి వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి, ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ విద్యార్థులకు సృజనాత్మకతను పెంచేందుకు ఈ పోటీలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఈ సంక్రాంతి సంబురాలలో అంబేద్కర్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్‌లు, అధ్యాపకలు, విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి అహ్లాదకరమైన పండుగ సంబురాలను నిర్వహించినందుకు యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దస్తులను ధరించి తెలుగుదనం,ఉట్టిపడే విధంగా భోగిమంటలు వేశారు. విద్యార్థులు పతంగులు ఎగురవేస్తూ ఆనందోత్సవాల మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యువతీ, యువకులకు, మహిళలకు సాంస్కృతిక పోటీలలో పాల్గొని ముగ్గులు, సాంస్కృతిక పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రకటించారు. విద్యార్థులు నిర్వహించినసాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

## వడ్డెరలు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి

**చిక్కడపల్లి, జనవరి 11 ప్రభాతవార్త:** వడ్డెరలు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని వక్తలు పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 217 జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేట సత్యనారాయణ, వడ్డెర సంఘం గన్ను దెబ్బ అధ్యక్షుడు వేముల వెంకటేశ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రభుత్వ వడ్డెర ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. అంతకుముందు వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం ప్రసంగించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వైస్‌చైర్మన్ ఎత్తిరి అంతయ్య, సంఘాల నాయకులు శివరాత్రి ఐలమల్లు, దుండుగులు రాజ్యలక్ష్మి, ఎత్తిరి మారయ్య, ఒర్సు కృష్ణయ్య, ట్రస్ట్ డైరెక్టర్‌లు ఎం.వెంకటేశ్, వల్లెపు వెంకటేశ్, శివభూపతి, హన్మంతు, యాదయ్య, లింగయ్య, సుధాకర్, వరకుప్పల ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత గాయకుడు కెజె.ఏసుదాస్

**చిక్కడపల్లి, జనవరి 11 ప్రభాతవార్త:** మహోన్నత గాయకుడు కెజె.ఏసుదాస్ అని వక్తలు ప్రశంసించారు. శ్రీకృష్ణ స్వరరాగ స్రవంతి సమర్పణలో గానగంధర్వుడు పద్మవిభూషణ్ డాక్టర్ కెజె.ఏసుదాస్ 84వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 'అమృతం తాగినవాళ్ళు' పేరుతో తెలుగు, తమిళ, కన్నడ మలయాళ హిందీ ఆణిముత్యాలతో సినీ సంగీత విభావరి కార్యక్రమం ప్రధాన గాయకుడు వైఎస్.రామకృష్ణ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాల్-పద్మ దంపతులను ఆత్మీయంగా సత్కరించే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా వంశీ సంస్థల అధినేత, కళాబ్రహ్మ డాక్టర్ వంశీ రామరాజు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బూర్గుల మధుసూదన్, మోటివేషనల్ స్పీకర్ టి.రామకృష్ణ, కళావాచస్పతి విశ్వనాథ్ మద్దిపట్ల, కార్యక్రమం నిర్వాహక సంస్థ అధ్యక్షుడు వై.సుబ్రహ్మణ్యం, గాయనీ, వ్యాఖ్యానరతి ఎన్.లలిత తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన గాయకుడు వైఎస్.రామకృష్ణ సమర్పణలో గాయనీ గాయకులు అఖిల, జ్యోతిర్లత, నాగేశ్వరి, వీణ, శైలజ, స్వరకళ్యాణి, సాయి మేఘన, తుషార, ఇందునయన, జ్ఞానమయి, శ్రీచందన, భార్గవి తదితరులు అద్భుతంగా గానం చేశారు.

## కూకట్‌పల్లి సిఐకి అభినందనల వెల్లువ..



సిఐ కృష్ణ మోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కెపిహెచ్‌బి కాలనీ, జనవరి 11, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ల సర్కిల్ ఇన్స్‌పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన డి.కృష్ణ మోహన్‌ని కూకట్‌పల్లికి చెందిన స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షులు పటోళ్ళ నాగిరెడ్డి, మూసాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాచమల్ల శేఖర్‌గౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ఇంచార్జి సునీల్ కుమార్‌యాదవ్, డిసిసి కార్యదర్శి వెంకటరెడ్డి, భరత్‌నగర్ కాలనీ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ ముదిరాజ్, సురేష్‌రెడ్డిలు గురువారం సిఐని కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
సంక్షిప్త టెండర్ ప్రకటన
నిట్ నెం.23/EEC-4/LBNR/GHMC/2023-24, తేది: 11.01.2024, పని పేరు: నిర్వహణ పనులు-5 సం.లు. అంచనా మొత్తం: రూ.57.00 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీలు, సమయం: 12.01.2024 @ మ.03.00 గం. 23.01.2024 @ మ.03.00 గం. అధికారి పేరు, చిరునామా, సెల్ నం: శ్రీ డి. కొటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్-4, GHMC, (M): 9989094468. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, L.B. నగర్ సర్కిల్-4, GHMC
DIPR.No.9398-PP/CL/Advt/1/2023-24, తేది: 11.01.2024

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD
G.W. O.P.No. 43 of 2023
Between
T. Raghavacharyulu ...Petitioner
AND
(1) Whomsoever concerned
(2) Tiruthopu Dhanalakshmi ...Respondents
To
(1) Whomsoever concerned
(2) Tiruthopu Dhanalakshmi, R/o H.No.16-1-24/320/LCH, Saidabad Colony, Hyderabad-500059
Please take notice that the Petitioner has filed the above O.P. to appoint him as Legal Guardian of minor child Kum. Maddela Dhana Sriharitha D/o late M. Srihari, aged about One and half year, Resident of 16-1-24/230/LCH, Saidabad Colony, Hyderabad and the matter is posted to 05-02-2024. Any body having any objection for appointing the petitioner as Legal Guardian of the Minor to appear on the above said date at 10.30 AM, failing which necessary orders will be passed.
Take notice accordingly
(By order of the Court)
Sd/- Vasantrao Deshpande
Advocate
1-1-283/B, Flat No.301-B, Gautam Towers, Opp: e-Seva, Chikkadpally, Hyderabad-500020
COUNSEL FOR THE PETITIONER

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE, MEDCHAL MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
SOP No. 45 of 2023
Between:
Bhimavarapu Venkata Surya Kamesh Satya Prasad, ....Petitioner
And
HDFC Bank and Others
To ...Respondents
All concerned,
Please take notice that the above named Petitioner filed the petition U/s 372 of Indian Succession Act to declare the Petitioner as successor and legal heir of Late Bhimavarapu Venkata Rama Narasimha Rao, died on 28.05.2023. The case is posted to 29.01.2024, if anybody having any right are directed to appear before the Hon'ble Court on that day at 10.30 a.m. either in person or through Advocate, otherwise the matter will be decided accordingly.
//BY THE ORDER OF THE HON'BLE COURT//
M/s. D.MANI KUMAR,
Advocate
G-1, CETS Apt.Chaitanyapuri, Hyderabad-500 060.
Cell: 9848081775
Email:manikumar.adv@gmail.com
(Counsel for the Plaintiff)
11-01-2024, Hyderabad

## ట్రాఫిక్ సమస్యలను అధిగమిస్తాం : ఎమ్మెల్యే



సమస్యలను పరిశీలిస్తున్న సుధీర్‌రెడ్డి

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** ట్రాఫిక్‌సమస్యలను అధిగమించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా సుధీర్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం పలుహామీలు ఇచ్చిననేపథ్యంలో బాగంగా సరూర్‌నగర్ కట్ట వద్ద నూతనంగా నిర్మించనున్న బ్రిడ్జివెడల్పు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించడానికి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధ్యయనం చేయడం జరిగిందని తెలిపారు. అందులో బాగంగా సరూర్‌నగర్ కట్ట, పోస్ట్‌ఆఫీస్ చౌరస్తా, గాంధీబొమ్మవద్ద రోడ్డు విస్తరణ పనులు చేయడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమిస్తామన్నారు. బ్రిడ్జి వెడల్పు పనులు ప్రారంభించడానికి సన్నాహాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక్కొక్కటిగా పనులు ప్రారంభం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్‌కుమార్, కందికంటి శ్రీధర్‌గౌడ్, రమణారెడ్డి, యదా శంకర్, వీక్కీ, శివరాం, ప్రదీప్ అధికారులు ఈఈ శ్రీనివాస్, ఏఈ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## నారాయణలో ఘనంగా సంక్రాంతి సంబరాలు



విద్యార్థులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

**సరూర్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ సాంప్రదాయాన్ని అద్దం పట్టే విధంగా విద్యార్థులు భోగి మంటలు వేసి రంగు రంగుల ముగ్గులు వేశారు. అదే విధంగా పండుగ ప్రాముఖ్యతను తెలిసే విధంగా గాలిపటాలను ప్రదర్శించారు. అయితే ఉత్సవాల్లో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. ప్రిన్సిపాల్ బాబ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంబరాల్లో డిజిఎం గోపాల్‌రెడ్డి, ఎజిఎం రవీందర్‌బాబు, కో-ఆర్డినేటర్లు మనోహర్, వాణి, డీన్ రాజేందర్, ఎఒ మాధవి, విపిలు ధరణి, ధనలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం : ఏఈఈ గోపాల్

**నేరేడ్‌మెట్, జనవరి 11 ప్రభాతవార్త:** విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్‌కు అంతరాయం అవుతుందని విద్యుత్ ఏఇఇ గోపాల్ పేర్కొన్నారు. 11కెవి విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆర్.కె.హెచ్‌కాలనీ, అంబేద్కర్‌నగర్‌లో నేడు ఉదయం 10గంటల నుండి 12గంల వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి : సురేందర్‌రెడ్డి



అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న సురేందర్‌రెడ్డి తదితరులు

**మలక్‌పేట, జనవరి 11 ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అక్బర్‌బాగ్ డివిజన్‌లోని ఆర్‌ఎస్‌ఎస్ గ్రౌండ్‌లో వికసిత భారత్ సంకల్పయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి వికసిత సంకల్పయాత్రను చేపట్టడం జరిగిందన్నారు. బస్తీలలో ఉండే పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి లబ్ధి పొందడానికి కృషి చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో సంకల్ప్ యాత్ర నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, నాయకులు ఎల్‌బి శాస్త్రి, నరేష్‌యాదవ్, నవీన్, రాజేష్, సండడి సురేందర్‌రెడ్డి, రామారావు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంటిన్‌జెంట్ లీడర్‌గా జాహేదాబేగం

**హయత్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త:** ఈనెల 14 నుంచి 20వ తదీవరకు ఎంఎల్ఆర్ కళాశాలలో నిర్వహించనన్న జాతీయ సమ సమైక్యతా శిబిరానికి ఉస్మానియా యూనివర్సిటీ కాంటిన్‌జెంట్ లీడర్‌గా హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జాహేదాబేగం ఎంపికయ్యారు. 7రోజుల పాటు కొనసాగనున్న ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి ఎంపికైన 6గురు విద్యార్థుల బృందానికి జాహేదాబేగం నాయకత్వం వహిస్తారు. 2వసారి లీడర్‌గా ఎంపికైన జాహేదాబేగంను కళాశాల ప్రిన్సిపల్ జోత్స్నప్రభ, ఆద్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## ఘనంగా తుర్కయంజాల్‌లో ఓబన్న జయంతి



వడ్డె ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

**తుర్కయంజాల్, జనవరి 11 ప్రభాతవార్త:** వడ్డెర వృత్తిదారుల సంఘం తుర్కయాంజాల్ అధ్యక్షులు నర్ర పాండు ఆధర్వంలో గురువారం స్వాతంత్ర సమరయోధుడు వడ్డె ఓబన్న 217 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు కుంచం వెంకటకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లపు విఘ్నేశ్‌లు హాజరైమాట్లాడుతూ ఉయ్యాలవాడ నర్సింహ్మారెడ్డికి సర్వసైన్యాధక్ష్యులు ఉండి వీరోతపోరాటం బ్రిటిష్‌వారిపై గెరిల్లా యుద్ధం చేశారన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి నేటికీ 76 సంవత్సరాలు అవుతున్నా వడ్డెర్లను ఏ ప్రభుత్వం గుర్తించిన దాఖలు లేవని సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒబన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర సోషల్ మీడియా కన్వనర్ దేరంగుల రామకృష్ణ మాట్లాడుతూ వడ్డెర వృత్తిదారులకు భీమా సౌకర్యం కల్పించి, గుట్టలపై క్వారీలపై పూర్తి హక్కులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్రా బిక్షపతి, ఓర్సు శ్రీనివాస్, దేరంగుల వినయ్,తన్నీరు సైమన్, గండికోట సత్యం, దేరంగుల బాలకృష్ణ, బాయ్ ముత్క శ్రీనివాస్, గండికోట కృష్ణ,వేముల మల్లేష్ ,వేముల శ్రీను, వేముల విజయ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల కంప్యూటరీకరణ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ప్రజాపాలన దరఖాస్తుల ఎంట్రీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, జనవరి 11 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును కంప్యూటరీకరణ చేయిస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ప్రజా పాలన కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను డిసి శ్రీనివాస్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసి అర్హులైన వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. డేటా ఎంట్రీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి అర్హులకు పథకాలు అమలు అయ్యే విధంగా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు 90 శాతం డాటా ఎంట్రీ పూర్తయిందని, మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో దరఖాస్తులను కంప్యూటరీకరణ చేస్తామని తెలిపారు. అనంతరం ఉప్పల్ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులతో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, బిఆర్ఎస్ నేతలు ఆకుల మహేందర్, పి.జితేందర్‌రెడ్డి, అన్న బాలకృష్ణ, కొండ్రు హనుమంతు, నిరంజన్‌చారి, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలను పరిష్కరించాలని వినతి



కార్పోరేటర్ దేవేందర్ రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కాలనీవాసులు

**నాచారం,జనవరి 11 ప్రభాత వార్త:** మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కెఎల్‌రెడ్డినగర్, హెచ్‌సీఎల్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పి.మహేందర్ రెడ్డి బృందం స్థానిక కార్పోరేటర్ పన్నాల దేవవేందర్ రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. కాలనీల్లో సీసీరోడ్డును ఏర్పాటు చేశాయలని, సెవరేజ్ అవుట్ లెట్‌ను ఏర్పాటు చేయాలని వారు కార్పోరేటర్‌కు అందించిన వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యాకుబ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలి : ఆకుల



సమస్యలను పరిశీలిస్తున్న ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** డివిజన్లోని కాలనీలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ పేర్కొన్నారు. సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని బాపునగర్ చౌడి ప్రాంతాలలో అధికారులతో కలిసి ఆమె పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌పరిధిలో డ్రైనేజీ లీకేజీ సమస్యలు పరిష్కరించాలని, గుంతలమయంగ మారిన రోడ్లను వెంటనే బాగు చేయాలన్నారు. డివిజన్ సమస్యలను పరిశీలించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన సమస్యలను పరిష్కరించాలన్నారు.

## సుధీక్షా ప్లే స్కూల్‌లో సంక్రాంతి సంబురాలు



సంక్రాంతి సంబురాల్లో చిన్నారులు..

**నేరేడ్‌మెట్ జనవరి 11 ప్రభాత వార్త:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్ రోడ్‌నెంబర్ 4లో ఉన్న సుధీక్ష ప్లే స్కూల్‌లో సంక్రాంతి పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో సాంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు మెరిసారు. హరిదాసు, రైతు, పోలీస్ తదితర వేషాలను వేసి అందరిని ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్ మంజుల సంక్రాంతి పండుగ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సరస్వతీనగర్‌లో సందడిగా ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, జనవరి 11 ప్రభాతవార్త:** డీసీబీ బ్యాంక్ ఆద్వర్యంలో గురువారం నాచారం సరస్వతీనగర్ కాలనీలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, అమ్మాయిలు ఎంతో ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగురంగుల ముగ్గులను వేశారు. ఈ కార్యక్రమానికి కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై గెలుపొందిన వారికి బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీసీబీ బ్యాంక్ మేనేజర్ విజయ సారధి, కాలనీ అధ్యక్షులు వనం జయరాజ్, నాగభూషణం, హనుమంతరావు, నాయకులు కట్టబుచ్చన్న గౌడ్, మేకల ముత్యం రెడ్డి, విఠల్ యాదవ్, నరసింహ్మాతో పాటు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## పకడ్బందీగా అభయహస్తం దరఖాస్తుల ప్రక్రియ

**తుర్కయంజాల్, జనవరి 11 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అభయహస్తం దురఖాస్తులు ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతమైనట్లు తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులకు గాను 19362 దరఖాస్తులు రాగా గురువారంవరకు 16వేల దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకో రెండు రోజుల్లో ప్రక్రియ ముగుస్తుందన్నారు. సెయింట్ పాల్స్ ఫార్మసీ కాలేజీలో ఆన్‌లైన్ ప్రక్రియను సుధాకర్‌రావు సందర్శించి తనిఖీలు చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి : బలాల



అధికారులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, జనవరి 11 ప్రభాతవార్త :** దివ్యాంగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తాలోని జాతీయ పార్కులు మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా అస్మాన్‌ఘడ్ జలమండలి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మంచినీటి సరఫరాల్లో సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జయంత్, అధికారులు ఉపేందర్‌రెడ్డి, జలమండలి సీఎం ఖాదర్ మొయినుద్దీన్, ఏఈ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అభ్యున్నతి సాధించాలి : ఉప్పల



బహుమతులను ప్రదానం చేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించాలని రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ఓం శ్రీ మాత్రే నమః మహిళాసంఘం 2వ వార్షికోత్సవం కొత్తపేట శ్వేతా గార్డెన్లో మంజుల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ, స్త్రీ లేనిది ప్రపంచమేలేదని, మగవాళ్లకు దీటుగా మహిళలు అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంటున్నారన్నారు. మహిళలు రాజకీయ, సామాజిక, వ్యాపార, ఉద్యోగ, ఆర్థికపరంగా పురుషులకు దీటుగా మహిళలు ముందుకు దూసుకు పోతున్నారన్నారు. కార్యక్రమంలో చైతన్యపురి కార్పొరేటర్ నరసింహగుప్తా, సినీ నటుడు శ్రీనివాస్, ఎల్బీ కుమార్, గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలరాజుగుప్తా, జయప్రకాష్‌రావు, అధ్యక్షురాలు మంజుల, చకిలం స్వప్న పాల్గొన్నారు.

## బ్రిలియంట్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు



వివిధ వేషధరాణలతో విద్యార్థులు, చిత్రంలో ప్రిన్సిల్ మల్లేష్, ఉపాధ్యాయులు

**హైదరాబాద్, జనవరి 11 ప్రభాతవార్త :** మీర్‌పేట్ మున్సిపాలిటీ జిల్లెలగూడ న్యూ గాయత్రినగర్‌లోని బ్రిలియంట్ గ్రామర్ స్కూల్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ గునగంటి మల్లేష్‌గౌడ్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు విద్యతోపాటు, సహపాఠ్య కార్యకలాపాలు, సీసీఏ, ఈసీఎలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పండుగలు, సాంప్రదాయాలు వాటి ప్రాముఖ్యత గురించి వారికి వివరిస్తూ, నాటికలు, స్కిట్స్ వేయిస్తున్నామని తెలిపారు. గురువారం జరిగిన వేడుకల్లో సాంప్రదాయం ఉట్టిపడేలా బొమ్మల కొలువుతోపాటు చిన్న పిల్లలకు భోగి పండ్లు పోయడం, ముఖ్యంగా పొంగలి తయారు చేసి విద్యార్థులకు, తల్లిదండ్రులకు పంచారు. బాలురు స్వయంగా గాలిపటాలు తయారుచేసి ఎగరవేసి ఆనందం పంచుకున్నారు. అమ్మాయిలు సాంప్రదాయ దుస్తులతో విచ్చేసి ముగ్గులు వేసి పాఠశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతోపాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సంకల్ప్ స్కూల్ వార్షికోత్సవ సంబరాలు



సంకల్ప్ స్కూల్ వార్షికోత్సవ సంబరాల్లో పాల్గొన్న ప్రముఖులు

**తుర్కయంజాల్, జనవరి 11 ప్రభాతవార్త:** సంకల్ప్ స్కూల్ వార్షిక దినోత్సవ సంబురాలు ఉడాన్ 2024 పేరుతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిందు మాధవ్ ఐఎఎస్, సతీమణి డాక్టర్ అలేఖ్య, గౌరవ అతిథులుగా సాయిరామ్, ప్రముఖ సైంటిస్టు, ప్రముఖ సైకాలజిస్ట్ గంప నాగేశ్వర్‌రావు, సంకల్ప్ చైర్మన్ కందడా లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ రామ్‌రెడ్డి, డైరెక్టర్లు కుమార స్వామి, మధుకర్‌రెడ్డి, రాజు, విద్యా వేత్త చలపతిలు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు వారి అనుభవాలు,నైతిక విలువల, సైన్స్, విద్యారంగములో వస్తున్న మార్పుల గురించి వివరించారు. విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలకు అధిరోహించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు నృత్యాలు, కరాటే, యోగ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రస్తుత, పూర్వవిద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రోడ్డుపై నుంచి విద్యుత్ స్థంభాన్ని మార్చి భవిష్యత్ ప్రమాదాలను నివారించాలి



జాతీయ రహదారిలో ప్రమాదకరంగా విద్యుత్ స్థంభం... పక్కనే తీగలు లేకుండా నూతన స్థంభం

**హయత్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త:** జాతీయ రహదారి విస్తరణలో భాగంగా అధికారులు పనులను ఒకింత వేగవంతంగానే పూర్తిచేస్తున్నా... అక్కడక్కడ నిర్లక్ష్యం కన్పిస్తోంది. దీనికి విభాగాలమధ్య సమన్వయం లేకపోవడం కారణంగా తెలుస్తోంది. జాతీయ రహదారుల విభాగం విద్యుత్ శాఖాధికారులతో సమన్వయ లోపాల కారణంగా అక్కడక్కడ పనులు ఆలస్యమవుతున్నాయి. దీనికారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దఅంబర్‌పేటలో జేసీబీ జంక్షన్ సమీపంలో ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండడంతో యూటర్న్ మూసి వేశారు. అక్కడే పెద్దఅంబర్‌పేట్‌గ్రామంనుంచి జాతీయ రహదారి సర్వీస్‌రోడ్డులోకి వాహనాలు వస్తుంటాయి. అయితే... అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రి నిర్మాణం కొనసాగుతోంది. ఆసుపత్రి ముందు హైటెన్షన్ విద్యుత్ స్థంభం రోడ్డుమీద ఉంది. పక్కన కొత్తగా విద్యుత్ స్థంభాన్ని ఏర్పాటు చేసినా నూతనంగా ఏర్పాటుచేసిన విద్యుత్ స్థంభానికి తీగలను మాత్రం మార్చలేదు. అసలే సర్వీసు రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతుండగా... రోడ్డుపైనే విద్యుత్ స్థంభం కారణంగా వాహనదారులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయరహదారిపై విద్యుత్ స్థంభం కారణంగా అనుకోని ప్రమాదం జరిగితే ప్రాణ, ఆస్థినష్టం సంభవించే అవకాశం ఉంది. వెంటనే విద్యుత్ తీగలను మార్చి స్థంభాన్ని రోడ్డుమీద నుంచి తొలగించి ప్రమాదాలను నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

## పేదల పాలిట వరం సిఎం రిలీఫ్ ఫండ్ : కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి



చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలపాలిట వరమని జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌కు చెందిన జగదీష్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ చికిత్స చేయించుకునే క్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిని కలిసి సిఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించాల్సిందిగా కోరడంతో ఆయన వెంటనే స్పందించి అవసరమైన పత్రాలతో సిఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ నేపధ్యంలో సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎల్ఓసిగా మంజూరైన రూ.1.50లక్షల చెక్కును జగదీష్‌కు అందజేశారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

**సైదాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని బిజెపి రాష్ట్ర మహిళా విభాగం కోశాధికారి ఉప్పల రాజ్యలక్ష్మి అన్నారు. చంపాపేట ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ముందంజ వేయాలన్నారు. కాగా ముగ్గుల పోటీలలో మొదటి బహుమతిని విజిత, 2వ బహుమతిని శశి, 3వ బహుమతి స్వాతి గెలుచుకున్నారు. అంతకు ముందు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సరిత ఊరె రవీందర్, అన్నదాన కమిటీ కన్వీనర్ ఇదుకుల విజయనాథ్, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్ గుప్తా, ఎలకుర్తి జగన్ గుప్తా, గౌరవ అధ్యక్షుడు సాయిరాంగుప్తా, మధు, కటకం సతీష్, వి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి అక్షింతల పంపిణీ : భాగ్యలక్ష్మి



రాములవారి అక్షింతలను అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు

**మలక్‌పేట, జనవరి 11 ప్రభాతవార్త :** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం వారి ఆధ్వర్యంలో మూసారాంబాగ్ ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో శ్రీరాముల వారి అక్షింతలను డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి అభయాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు, రామ భక్తులతో కలిసి ఇంటింటికి శ్రీరాములవారి అక్షింతల పంపిణీ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 15వ తేదీ వరకు రాముల వారి అక్షింతల పంపిణీ, అయోధ్య మందిరం చిత్రపటంతోపాటు ఆహ్వాన పత్రాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 22వతేదీన అయోధ్యలో శ్రీరాముల వారి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్ని దేవాలయాల్లో భజన, నామస్మరణ, సంకీర్తన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, రవీందర్ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కిరణ్, ప్రవీణ్, గౌర దేవేందర్, యశ్వంత్, ఉమేష్, రాజు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంబ్రిడ్జిలో సందడిగా సంక్రాంతి సంబరాలు



ముగ్గులు వేస్తున్న చిన్నారులు

**సైదాబాద్, జనవరి 10 ప్రభాతవార్త:** కరణ్‌బాగ్‌లోని కేంబ్రిడ్జి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. బాలురు పతంగులను తయారుచేసి ఎగురవేసి సందడిచేశారు. బాలికలు గ్రూపులుగా విడిపోయి పాఠశాల ప్రాంగణంలో అందమైన రంగులతో రంగవల్లులు తీర్చిదిద్దారు. ఉన్నత తరగతుల బాలికలు పలువురు చిన్నారులకు సాంప్రదాయబద్ధంగా భోగిపండ్లు పోశారు. ఈ సందర్భంగా కేంబ్రిడ్జి విద్యాసంస్థల అధిపతి కె.శంతన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటినుంచే మన సంస్కృతి సాంప్రదాయాలు, పండుగల ప్రాశస్త్యాన్ని తెలియజేయాలన్నారు. అనంతరం పతంగుల తయారీ, ముగ్గుల పోటీల విజేతలకు ప్రిన్సిపాల్ కె.యూన్సీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బాల వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చాటిన సిల్వర్ డ్రాప్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందించిన ఛైర్మన్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

**సరూర్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురుకుల విద్యాపీఠ్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగిన జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన 2023-24 (సైన్స్ ఎక్స్‌పో)లో మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడకు చెందిన సిల్వర్ డ్రాప్స్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఎగ్జిబిట్స్ ప్రదర్శించి 2వస్థానంలో నిలిచారు. 321 ప్రదర్శనాంశాల్లో సిల్వర్ డ్రాప్స్ విద్యార్థులు ప్రదర్శించిన చంద్రయాన్-3 లాంచింగ్ అదే విధంగా ఫుడ్ చైన్, ఇన్నోవేషన్స్‌కి ద్వితీయ స్థానం లభించింది. బాల వైజ్ఞానిక ప్రదర్శనలో చక్కని ఎగ్జిబిట్స్ ప్రదర్శించి బహుమతులు పొంది పాఠశాలకు పేరు తీసుకువచ్చిన విద్యార్థులు ఆస్తా శుక్లా, హాసిని, అలేఖ్య, షణ్ముఖలను సిల్వర్ డ్రాప్స్ విద్యా సంస్థల ఛైర్మన్ జె.శ్రీనివాసరావు అభినందించారు. అదే విధంగా విద్యా ర్థులకు సహకరించిన ఉపాధ్యాయులు స్వప్న, కామేశ్వరి, దివ్య, ప్రోగ్రాం మెంటర్ ఎసి మాధవి తదితరులను కూడా ఆయన అభినందించారు.

## సైన్స్ ఎక్స్‌పోలో లార్డ్స్ విద్యార్థులకు బహుమతులు

**సరూర్‌నగర్, జనవరి 11 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లెలగూడ సిల్వర్ డ్రాప్స్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఇబ్రహీంపట్నం గురుకుల పీఠ్‌లో జరిగిన సైన్స్ ఎక్స్‌పోలో సుమారు వందకు పైగా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. అయితే ఈ ఎక్స్‌పోలో లార్డ్స్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన మెడిసిన్ రిమైండర్, బ్లైండ్ స్టిక్‌లకు ప్రథమ, ద్వితీయ స్థానాలు లభించాయి. వారికి డిఇఒ సుశీందర్‌రావు, సైంటిస్ట్ రఘునందన్ బహుమతులను అందజేశారు. సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ చాటిన విద్యార్థులను లార్డ్స్ ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ సరిత, గైడ్ టీచర్ అశోక్‌లు అభినందించారు.